Rs. 12/- per copy

# విద్యార్థి జ్వాల

Vol. 28 - No.9

July 2022



## క్రీస్తును అనుకరిద్దాం

# మన జీవనశైలి... క్రీస్తునుపోలి


ఆఫ్రికా దేశానికి ఒకాయన సువార్త చెప్పడానికి వెళ్ళి, "ప్రియులారా! యేసుక్రీస్తు ప్రభువు రెండువేల సంవత్సరాల క్రితం ఈ లోకానికి వచ్చాడు. ప్రజల పట్ల ఎంతో ప్రేమను, కనికరాన్ని చూపించాడు. రోగుల్ని స్వస్థపరచాడు. దయ్యాల్ని వెళ్ళగొట్టాడు. పరిశుద్ధునిగా, దీనుడిగా జీవించాడు. పాపులైన మానవులకు దేవుని రాజ్యాన్ని గురించి ప్రకటించాడని" వివరించాడట. మీటింగ్ అయిన తర్వాత కొంతమంది ప్రజలు ఆయన దగ్గరకు వచ్చి "మీరు చెప్పిన ఆయనను మేము చూశాము, ఆయన మాకు బాగా తెలుసు, ఆయన మా దగ్గరే ఉన్నాడని" అన్నారట. అందుకు ఆ సువార్తికుడు ఆశ్చర్యంగా వారితో "ఆయన రెండువేల సంవత్సరాల క్రితం చనిపోయి, సమాధి చేయబడి, తిరిగిలేచి పరలోకానికి ఆరోహణమయ్యాడని" చెప్పగా, వారు "లేదండీ! ఆయన మా మధ్యనే ఉండేవాడు, ఎప్పుడూ సంతోషంగా ఉండేవాడు, మమ్మల్ని ప్రేమతో పలకరించేవాడు, ఆయన ప్రార్థన చేస్తే స్వస్థత కలిగేది. అంతేకాదు, ఆయన మా మధ్యనే చనిపోయాడు. ఆయనను మేమెంతో ప్రేమించాము, ఆయన గుండెను మా దగ్గరే ఉంచుకొన్నాము, రండి చూపిస్తామని" తీసుకువెళ్ళి చూపించారు. అది డేవిడ్ లివింగ్‌స్టన్ సమాధి. ఆఫ్రికా ప్రజలకోసం తన జీవితాన్ని అంకితం చేసిన మిషనరీ. ఆయన ఆఫ్రికా దేశములోని ప్రజల మధ్య క్రీస్తులా జీవించాడు. అక్కడ ఉన్నవారు ఆయనలో క్రీస్తును చూడగలిగారు.

యేసుక్రీస్తు ప్రభువును అంగీకరించిన తర్వాత ఒక విశ్వాసి లక్ష్యం క్రీస్తును పోలి నడుచుకోవడమే. దేవుడు మనలను తన కుమారునితో సారూప్యము గలవారిగా ఉండడానికి ముందుగా నిర్ణయించి (రోమా 8:29) అలా నడచుకోవాలని ఆశిస్తున్నాడు. "క్రీస్తును పోలి జీవించడమే ఈ ప్రపంచంలో అత్యున్నతమైన జీవన ప్రమాణం" అని అంటాడు విలియం బార్క్లే. "ఇది అత్యున్నతమైన జీవన విధానం" అని మార్టిన్‌లాయిడ్ జోన్స్ అంటాడు. "క్రీస్తును అనుకరించడం ప్రతి విశ్వాసి బాధ్యత" అని అలెగ్జాండర్ మాక్లారెన్ అంటాడు. "నేను క్రీస్తులా ఉండాలనుకొంటున్నాను, ఆయనను మాత్రమే అనుసరించాలని కోరుకొంటున్నాను" అని మిషనరీ అదోనీరామ్ జడ్సన్ అంటాడు. అపొస్తలుడైన పౌలు కూడా నేను క్రీస్తునుపోలి నడుచుకొనుచున్న ప్రకారం మీరును నన్నుపోలి నడుచుకోండి (1 కొరింథీ 11:1) అని విశ్వాసులకు పిలుపునిస్తున్నాడు.

క్రీస్తును పోలి నడచుకోవడం ఎలా? ఆయన సారూప్యం మనలో ఎలా ఏర్పడుతుంది? అనే ప్రశ్నలకు "ద కంప్లీట్ బుక్ ఆఫ్ డిసైపుల్‌షిప్" అనే పుస్తకంలో బిల్‌హల్ ఆరు విషయాలను ప్రస్తావించాడు. 1. మనస్సు, 2. ప్రవర్తన, 3. సంబంధాలు, 4. అలవాట్లు, 5. సేవ, 6. ప్రభావం చూపించే విషయాల్లో సంపూర్ణంగా రూపాంతరం చెందాలని, క్రీస్తువలె జీవించాలని చెబుతాడు. రూపాంతరం చెందడమంటే కొన్ని చెడు అలవాట్లను మానుకోవడం, చెడ్డ మాటలను మాట్లాడకుండా ఉండడం, అనైతిక ప్రవర్తనను మానుకోవడం, జీవితంలో ప్రగతి సాధించడం, మెరుగవ్వడం కాదు. పాపంతో, అసత్యంతో సంబంధం ఉన్న పాత ఆలోచనా విధానాన్ని, అలవాట్లను, దృక్పథాన్ని, నమ్మకాలను, అభిప్రాయాలు మొదలగువాటన్నిటినీ తీసివేసి వాటి స్థానంలో దేవుని సత్యంతో, దేవుని చిత్తంతో, ఆయన వాక్యంతో నింపుకొని దైవకేంద్రిత జీవితాన్ని జీవించడం. ఇలా దినదినం మన శరీరాల్ని సజీవయాగంగా ఆయనకు సమర్పించుకొంటూ, దేవుని వాక్య విలువలతో జీవిస్తూ ఉంటే క్రమక్రమంగా రూపాంతరం చెందుతూ క్రీస్తుపోలికలోకి మారతాము. యేసుక్రీస్తు దైవమానవునిగా ఈ లోకంలో జీవించినప్పుడు తన ప్రవర్తనలో, పరిశుద్ధతలో, ప్రార్థించడంలో, ఉపవాసంలో, ఉపదేశంలో, మాట్లాడడంలో, ప్రేమించడంలో సమస్త విషయాల్లో ఆయన ఎలా జీవించాడో అలా జీవిస్తాము. అప్పుడు ప్రజలు మనలోని క్రీస్తు సారూప్యాన్ని చూస్తారు.

నేడు సంఘంలో క్రైస్తవులని పిలువబడుచున్నవారు, నాయకులు, క్రీస్తును గూర్చి బోధించేవారు, పరిచర్య చేసేవారి కొదువే లేదు గానీ, క్రీస్తును పోలి జీవించేవారి కొదువ తీవ్రంగా ఉంది. నూతన నిబంధనలో అంతియొకయ సంఘం క్రీస్తునుపోలి జీవించే సంఘంగా ఉంది. ఆ సంఘాన్ని గమనిస్తే వారు మొదట ప్రభువు తట్టు తిరిగారు (అపొ.కా. 11:21), తర్వాత ప్రభువును స్థిర హృదయంతో హత్తుకున్నారు (అపొ.కా. 11:23), ప్రభువు పక్షాన చేరారు (అపొ.కా. 11:24). వారి జీవనశైలి క్రీస్తును పోలి ఉండటం అక్కడి వారు గమనించి శిష్యులను క్రైస్తవులని పిలిచారు (అపొ.కా. 11:26). థెస్సలోనికయ సంఘం వారు కూడా ప్రభువును పోలి నడచుకొన్నారని (1 థెస్స 1:6) అపొస్తలుడైన పౌలు సాక్ష్యమిస్తున్నాడు. మనం క్రైస్తవులమయితే క్రీస్తునుపోలి జీవించాలి, మన గురించి కూడా లోకం, తోటివారు సాక్ష్యమివ్వాలి. అలాంటి జీవనశైలి కలిగి ఉండేటట్లు ఆశిద్దాం, ప్రార్థిద్దాం, ప్రయాసపడదాం.

– పి. సునీల్ జాకబ్




Vol. 28, No.8 July 2022
A Publication of
UESI Publication Trust

EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Honorary Editor
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Dr. J. Subbarao - Sec., Litt.Dept.

CONTACT:

The Editor, Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com

GIFTS & SUBSCRIPTIONS:

Can be made by Cheque/DD/MO
in favour of UESI-AP,
Abhishek Nagar, Nambur - 522 508
ANNUAL: GRADUATES - Rs.250
STUDENTS - Rs. 120
LIFE INLAND - Rs. 2000
LIFE OVERSEAS - US $ 150

VIDYARTHI JWALA ACCOUNT NO:

**SBI - 36698741798**
**IFS Code: SBIN0011994**
**uesiap vj, Nambur Branch**

GENERAL CONTRIBUTIONS ACCOUNT NO:

**SBI - 10949477628**
**IFS Code: SBIN0000844**
**Commercial Branch, Guntur**

LITERATURE ACCOUNT NO:

**SBI - 36698741437**
**IFS Code: SBIN0011994**
**uesiap pt, Nambur Branch**

**Please inform/ SMS to**
**Mr. A. Venu, Accountant (9849516060)**
**Email: <uesiapacc84@gmail.com>**

TOPICS:

August : Patriotism

**Note:** Please send your writeups on or before
**10th of every month**



# క్రీస్తులా జీవించడం!

కొన్ని సంవత్సరాల క్రితం, నేను యువ క్రైస్తవునిగా ఉన్న రోజుల్లో నన్ను, నా స్నేహితులలో కొంతమందిని ఒక ప్రశ్న చాలా కలవరపరచడం నాకింకా గుర్తే. తన ప్రజల పట్ల దేవుని ఉద్దేశం ఏమిటి? అన్నదే ప్రశ్న. మనము రక్షణ పొందాము. క్రీస్తులో నూతన జీవాన్ని పొందాము. ఇక చాలుకదా! మనం ఇంకా దేనికోసం ఉండాలిక్కడ? “దేవుని మహిమపరచడం, ఆయనయందు ఆనందించడమే మానవ జీవితం ముఖ్య ఉద్దేశం” అనే ప్రఖ్యాతిగాంచిన వెస్ట్‌మినిస్టర్ షార్టర్ కేటకిజమ్ వాక్యము మనకందరికీ తెలుసు. మనం దీన్ని నమ్మాము కూడా. ‘దేవుని ప్రేమించు, నీ పొరుగువారిని ప్రేమించు’ వంటి వాక్యాలు కూడా మనకు తెలుసు. కానీ, ఇవిగానీ, మరొకటి గానీ మనకు సంతృప్తినివ్వలేదు. కాబట్టి ఈ భూమి మీద నా యాత్ర అంతిమదశకు వచ్చిన ఈ సందర్భంలో నా మనస్సు ఒక అంశముపై కేంద్రీకృతమైనది. దేవుడు తన ప్రజలు ‘క్రీస్తువలె ఎదగాలని’ కోరుకొంటున్నాడు. క్రీస్తు సారూప్యమే దేవుని ప్రజల పట్ల దేవుని చిత్తము.

‘హేమ్లెట్ లేదా కింగ్ లియర్ వంటి డ్రామాలు నాకిచ్చి ఇలాంటి డ్రామాలను నీవు కూడా రాయమంటే నేను రాయలేను. ఎందుకంటే, అలాంటివి షేక్స్పియరే రాయగలడు. క్రీస్తు జీవితాన్ని చూపించి నీవు కూడా అలా జీవించమంటే నేను జీవించలేను. క్రీస్తు మాత్రమే జీవించగలడు. కానీ షేక్స్పియర్ వచ్చి నాలో జీవిస్తే అప్పుడు నేను అలాంటి డ్రామాలు రాయగలను. పరిశుద్ధాత్ముడు వచ్చి నాలో జీవిస్తే, అప్పుడు నేను ఆయనలా జీవించగలను.

– డా. జాన్‌స్టాట్

## లోపలి పేజీల్లో...

- మన జీవనశైలి...క్రీస్తును పోలి - 2
- క్రీస్తును పోలి నడుచుకోవడం - 4
- సహవాసం మానకు - 7
- పవిత్రంగా జీవిద్దాం - 11
- బలహీనతల నుండి బయటపడటం ఎలా? - 15
- ఉండాలి... ఉండరాదు.. - 18
- ఫాలోఅప్ - 19
- దైవభక్తి - 21
- స్పర్థ - 23
- అపవిత్రత నుండి పవిత్రతలోకి..- 24
- నా రాకడ కొరకు ఆత్మలను సిద్ధం చేస్తున్నావా? - 27
- క్రాస్ వర్డ్ పజిల్ - 27
- ఆనంద క్రైస్తవ జీవిత రహస్యం - 28
- సమస్యలకు నిజమైన పరిష్కారం ఉందా? - 29
- కోశాధికారి లేఖ - 31
- ప్రార్థిస్తూనే ఉండు - 32

కవర్ కథనం



# క్రీస్తును పోలి నడుచుకోవడం

జీవులు తమ తల్లిదండ్రులను చూసి నేర్చుకొంటూ వాటి జీవన విధానాన్ని అనుకరిస్తాయి. ఉదాహరణకు కోతిపిల్లలు చెట్లు ఎక్కడం, వేలాడడం తమ తల్లిదండ్రులను అనుకరించడం ద్వారా నేర్చుకుంటాయి. ప్రతి జీవికి ఒక ప్రత్యేకమైన జీవిత విధానం ఉంటుంది. అవి జీవించే పరిసరాలను బట్టి వాటి జీవన విధానం మారుతూ ఉంటుంది. దేవుడు మానవుని  సృజించినప్పుడు వారు రెండు జీవాలుగా, రెండు జీవిత విధానాలు కలిగి జీవించడానికి తగిన విధంగా వారిని సృజించాడు. అందుకే వారిలో జంతువులకు భిన్నంగా 'ఆత్మ' అనే సద్విషయాన్ని ఉంచాడు. ఆ ఆత్మ ద్వారా ఆదాము, హవ్వలు దేవునితో సంబంధం కలిగి, దేవునితో సహవాసం చేస్తూ, ఆయనతో మాట్లాడుతూ కొంతకాలం మానవ భౌతిక జీవితాన్ని, మానవ దేహంతోనే దేవునితో గల సంబంధాన్ని బట్టి దేవునిని అనుకరిస్తూ ఆత్మసంబంధమైన జీవితాన్ని కూడా జీవించారు. మనకు తెలిసినట్లు పాపము ద్వారా దేవునితో గల సంబంధాన్ని పోగొట్టుకొని ఒకే జీవంతో ఆ తర్వాత కొనసాగారు. మన ప్రభువైన యేసుక్రీస్తు వారి మరణ పునరుత్థానాల ద్వారా తిరిగి ఆదాము పోగొట్టుకొనిన ఆత్మీయ జీవితాన్ని జీవించడానికి విశ్వాసులకు అవకాశం ఇయ్యబడింది.

భౌతిక జీవిత విధానం మొదటిగా తమ తల్లిదండ్రులను చూసి నేర్చుకొంటారు. ఆ తర్వాత తక్కిన తమ జాతి ప్రజలను చూసి కూడా నేర్చుకుంటారు. రక్షణ కార్యం ద్వారా రెండవ జీవం (ఆత్మలో జీవం) ఆరంభమైనప్పుడు (యోహాను 3:3) వారు మానవాతీతమైన మరొక పెద్ద కుటుంబానికి సంబంధించినవారిగా జీవితాన్ని ప్రారంభిస్తారు. ఆ కుటుంబాన్ని "సార్వత్రిక సంఘం" లేక "దేవుని కుటుంబం" అని పిలుస్తారు. అప్పటినుండి ఆ వ్యక్తిలో రెండు జీవాలు, రెండు జీవితాలు సమాంతరంగా కొనసాగుతాయి. ఈ రెండిటిలో ఆత్మీయ జీవితం శాశ్వతమైనది. ఈ జీవన విధానాన్ని విశ్వాసి మొదటిగా తనను కనిన (1 పేతురు 1:22; యాకోబు 1:18) ప్రభువును చూస్తూ అంటే వాక్యము ద్వారా నేర్చుకొంటాడు, నేర్చుకొంటూనే ఉంటాడు. మౌళికంగ ఈ రెండు జీవన విధానాలు ఒకే పద్ధతిలో జరుగుచున్నప్పటికీ, వాటిని జీవింపచేసే జీవన శక్తిలో గల తేడా, ఆ రెండింటిని భిన్న జీవన విధానాలుగా గుర్తింపచేస్తుంది. శాశ్వతమైన, ఉన్నత ప్రమాణాలు

కలిగిన ఆత్మీయ జీవిత విధానం తాత్కాలికమైన భౌతిక జీవిత విధానాన్ని శాసించే విధంగా ఉన్నప్పుడే మానవ జీవితానికి దేవుని స్వరూపం, పోలిక వస్తాయి.

## దేవుని పోలికలో నడుచుకోవడం అంటే ఏమిటి?

దేవుడు తన కుమారుని ఈ లోకానికి పంపించడంలో గల పరమార్థం మనకందరికి తెలుసు. కానీ ఆ ప్రక్రియలో విశ్వాసిగా మారిన పాపిని దేవుడు తన కుమారుని స్వరూపంలోకి, ప్రవర్తనలోనికి, నడవడికలోకి మార్చడానికి అన్ని ఏర్పాట్లు చేశాడనే సత్యం మనకు తెలియాలి. ప్రతి విశ్వాసి ఈ ప్రక్రియను ప్రతి క్షణం తన ఆత్మీయ జీవితంలో అనుభవిస్తూ, దేవునితో సహకరించి దేవుని ఉద్దేశ్యాన్ని తన జీవితంలో నెరవేర్చాలనేది దేవుని కోరిక. దీనినే దేవుని వాక్యం పరిశుద్ధపరచబడడం అని, పరిపూర్ణతలోనికి రావడం అని, దేవునిలో ఎదగడం అని వివరిస్తుంది. ప్రతి విశ్వాసి రక్షింపబడిన వెంటనే దేవుని స్వరూపాన్ని పొందలేడు. కానీ అతని ఆత్మలో దేవుని స్వరూపానికి సంబంధించిన స్వభావం ఒక విత్తనంలాగ ఆ వ్యక్తిలో సృష్టించబడి నాటబడుతుందన్న విషయం చాలామంది విశ్వాసుల మనస్సులను చేరలేదనిపిస్తుంది. కొలస్సీ 3:10, ఎఫెసీ 4:24లో వివరించిన ఈ విషయాన్ని అర్థం చేసుకొంటే, నిత్యజీవం అనుభవించే ప్రతి విశ్వాసి క్షణ క్షణం ఈ నూతన స్వభావాన్ని ధరిస్తూ తన ఆత్మీయ జీవితం కొనసాగించడానికి సవాలు చేయబడతాడని, అతను/ఆమె వెనుకంజ వేసి పాతస్వభావాన్ని ధరించే ప్రమాదం ఎప్పుడూ పొంచి ఉంటుందన్న విషయం గుర్తించి అప్రమత్తత కలిగివుండాలని దేవుని వాక్యం గుర్తు చేస్తుంది.

ఈ నూతన స్వభావాన్ని ధరించుకున్న ప్రతి విశ్వాసి ఒక నూతన జీవన విధానానికి పిలువబడుచున్నాడు. దీనినే "క్రీస్తును పోలి నడుచుకోవడం" అని ఎఫెసీ 5:1,2 వచనాలలో రాయబడింది. క్రీస్తును పోలి నడుచుకోవడం మనుష్యులకు సాధ్యం కాని విషయమని, అది కేవలం ఒక ప్రత్యేక గుంపుకు మాత్రమే సాధ్యమని ఎఫెసీ 5:1 చెప్తుంది. ఆ గుంపు పేరు ప్రియులైన దేవుని పిల్లలు. పిల్లలు మాత్రమే తల్లిదండ్రులను అనుకరించగలరు. ఈ వచనంలో వాడిన గ్రీకు పదము (MIMETES). ఈ పదం నుండే ఇంగ్లీషు భాషలోని (MIME) అనే పదం వచ్చింది. మనమందరం (Mime) స్కిట్‌లు చూసే ఉంటాము. ఆ స్కిట్‌లో 'మైమ్' చేసేవారు మాట్లాడకుండ కేవలం అభినయంతో తమ మనస్సును వ్యక్తం చేస్తారు. మాటలు లేకుండా చేతలలో చూపించడమే 'మైమ్' లేక పోలి నడుచుకోవడం.

## దేవుని పోలి నడుచుకొనేవారి జీవిత విధానం

దేవుని పోలి నడుచుకునేవారు మాట్లాడరు కాని చేసి చూపిస్తారు. వారు దేవుని ప్రేమను గూర్చి మాట్లాడరు, ప్రేమించి చూపిస్తారు. దయను గూర్చి మాట్లాడరు కాని దయను తమ క్రియలలో చూపిస్తారు. వారు తగ్గింపును గూర్చి మాట్లాడరు, వారు తమ తగ్గింపును జీవితంలో చూపిస్తారు. పేరు ప్రఖ్యాతుల కోసం ప్రాకులాడరు, తమను తాము ఉపేక్షించుకొని ఏమీలేని వారిగా జీవించి చూపిస్తారు. విద్యార్థులను వారి హాస్టళ్ళలో కలుసుకొని వారిని పరామర్శించాలి అని ప్రసంగాలు ఇవ్వరు. వారి స్వంత గృహాలను విద్యార్థుల కొరకు తెరచి ఉంచుతారు. ఇతరుల అవసరాలలో పాలు పంచుకోవాలని ఉపన్యాసాలు ఇవ్వరు, తమకున్న దానిలో కొంత ఇతరులతో పంచుకొంటారు. ఆర్థిక సహాయాన్ని ఎవ్వరికీ తెలియకుండా తమవంతు పాలుపుచ్చుకొంటారు. మూడవ వ్యక్తి గురించి మాట్లాడరు, తీర్పులు చెప్పరు, చాటుగా గుసగుసలు ఉండవు. ప్రార్థన మీటింగులలో ప్రార్థనపై విశ్లేషణ, వ్యాఖ్యానాలు ఉండవు. ఏకాంతంగా, రహస్యంగా తలుపు వేసుకొని కన్నీటితో ప్రభువును గోజాడతారు.

పౌలు 1 కొరింథీ 4:11-16లో రాసిన మాటలు ఈ సందర్భంలో జ్ఞాపకం చేసుకోవాలి. దేవుని పోలి నడవడమంటే ఏంటో పౌలు వివరణ చూద్దాం. "ఈ ఘడియ వరకు ఆకలిదప్పులు గలవారము, దిగంబరులము, పిడిగుద్దులు తినుచున్నాము, నిలువరమైన నివాసము లేకయున్నాము. స్వహస్తములతో పనిచేసి కష్టపడుచున్నాము. నిందింపబడియు దీవించుచున్నాము. హింసింపబడియు ఓర్చుకొనుచున్నాము. దూషింపబడియు బ్రతిమాలుకొనుచున్నాము. లోకమునకు మురికిగాను అందరికి పెంటగాను ఇప్పటివరకు ఎంచబడియున్నాము... మీరు నన్ను పోలి నడుచుకొనువారై ఉండవలెనని మిమ్మును బతిమిలాడుకొనుచున్నాను". పౌలు జీవితములోని ఈ మాటలు, కేవలము మాటలు

కాదు, చేతలు. నేను యేసును ప్రేమిస్తున్నానని చెప్పవద్దు. ప్రేమించి చూపించు. యేసును ప్రేమించినందువల్ల వచ్చే పర్యవసానాలను పౌలు ఎదుర్కొని జీవించిన జీవిత విధానం ఇది. నేను క్రీస్తును పోలి నడుచుకొన్నట్లు మీరు నన్ను పోలి నడుచుకొనుడి అని పౌలు చెప్పిన మాటలకు సంబంధించిన వచనాలు (1 కొరింథీ 11:1; 1 థెస్స 1:6; 1 థెస్స 2:14) ఎన్నో చూడగలం.

## దేవుని పోలి నడుచుకోవడం ఎలా సాధ్యం?

ఒక్కసారి ఆగి ఆలోచించండి. క్రీస్తును పోలి నడుచుకోవడం సాధ్యమేనా? ఎఫెసీ 5:2లో ఉన్నట్లు "ఆలాగుననే మీరును ప్రేమ గలిగి నడుచుకొనుడి" అనే ఆజ్ఞకు లోబడడం ఎవరికీ సాధ్యం కాదు. దేవుని పోలి నడుచుకోవడం అంటే దేవుని కోసం నీవు, నేను ఏదైనా చేయడం కాదు, నీ ద్వారా, నా ద్వారా దేవుడే ఏదైనా చెయ్యడమని అర్థం చేసుకోవాలి.

క్రీస్తును పోలి నడుచుకొనుడి అనేది సలహా కాదు, దేవుని ఆజ్ఞ కాబట్టి వేరే మార్గం లేదు. కానీ దేవుడు ఒక ఆజ్ఞ ఇచ్చినప్పుడు దానిని నెరవేర్చడానికి కావలసిన ఏర్పాట్లన్నీ ముందుగానే సిద్ధం చేసి ఉంచుతాడు.

**మొదటిగా,** దేవుడు మనలను తన కుటుంబంలో జన్మింపచేసి తన స్వభావాన్ని కలిగిన పిల్లలుగా చేశాడు (కొలస్సీ 3:10; ఎఫెసీ 4:24). అంటే క్రీస్తు ప్రభువులాగా ప్రేమించగలిగే సామర్థ్యం, సత్తా మనలో సృష్టించబడిన నూతన స్వభావానికి ఉందని అర్థం చేసుకోవాలి.

**రెండవదిగా,** ఆయన ఆజ్ఞలను ఆయన ప్రమాణాల ప్రకారం నాతో చేయించడానికి కావలసినంత శక్తిని ఇవ్వగల ఆత్మదేవుని నివాసం నాకు అనుగ్రహించాడు. ఆయన శక్తితోనే ఆయన స్వభావాన్ని క్రియారూపంలోనికి తేగలను. దీనినే దైవవాక్యం ఆత్మఫలమని పిలుస్తుంది. ఆత్మదేవుని శక్తి నా శరీరములో కార్యరూపం దాల్చడమే ఆత్మఫలం. దేవుని ప్రేమ, దేవుని ఆనందం, దేవుని సమాధానం, దేవుని దీర్ఘశాంతం, దేవుని దయాళుత్వం, దేవుని మంచితనం, దేవుని నమ్మకత్వం, దేవుని సాత్వీకం, దేవుని ఆశానిగ్రహం, ఇవన్నీ నాలో నీలో క్రియారూపం దాల్చడానికి ఆత్మ దేవుడే సహాయపడతాడు.

## దేవుని పోలి నడుచుకోలేకపోవడానికి కారణం

క్రీస్తుప్రభుని ఒక విశ్వాసి అనుకరించలేకపోవడానికి మూలకారణం, ఆత్మ ఫలమును కలుగజేయు ఆత్మ దేవుని అధికారానికి అవిధేయత చూపడమే. ఆత్మ దేవునికి విధేయత చూపించడమే ఆయనను ప్రభువుగా కలిగివుండడం. విధేయతకు మూలము దేవునిపై విశ్వాసికి గల ప్రేమ (యోహాను 14:21,23,24). దేవుని వాక్యంలో దేవునిని ప్రతిరోజు ఆత్మీయ నేత్రాలతో చూచే విశ్వాసి ఆయనను ప్రేమిస్తూ, ఆయనలాగా ఉండడానికి ఇష్టపడతాడు. ఆత్మదేవునికి విధేయత చూపించడం ద్వారా విశ్వాసి తన ఇష్టానికి చనిపోతాడు. దేవునికి తన ఇష్టాన్ని అప్పగిస్తాడు. అప్పుడే ఆత్మదేవుడు విశ్వాసిలో నుండి దేవుని పోలి నడుచుకొనే ప్రవర్తనను దేవుని కుమారుని స్వరూపాన్ని ఏర్పరుస్తాడు.

## ముగింపు

దేవుని పోలి నడచుకొనకపోవడం ఒక పాపం. ఈ పాపంలో కొనసాగే విశ్వాసుల జీవితాలు ఈ లోకానికి అబద్ధ సాక్ష్యం అందిస్తాయి. దేవుడు శక్తిహీనుడని, ఆత్మీయ జీవితం అనేది లేదని, విశ్వాస జీవితం ఒక భావన మాత్రమేనని, అది ప్రసంగాలకు మాత్రమే పరిమితమవుతుందని లోకానికి చెప్తాయి. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు చెప్పినట్లు "క్రైస్తవులు (విశ్వాసులు) చెప్పే మాటలు మానవాతీతమైనవి, అసాధారణమైనవి కానీ వారి జీవితాలు సాధారణమైనవేనని సాక్ష్యం ఇస్తాయి". ఇంకెంతకాలం సత్యమెరుగని ఈ లోకానికి దేవుని సత్యాన్ని అందించడానికి నీకు అవకాశమున్నప్పటికి దానిని ఇవ్వక అబద్ధ సాక్షిగా కొనసాగుతావు? ఈ లోకం తల్లక్రిందులుగా ఉందని ధైర్యంగా చెప్పే సత్తాలేని విశ్వాసులు మన సహవాసాల్లో ఉన్నంతకాలం, విద్యార్థి లోకాన్ని దేవుని సత్యంతో ప్రభావితం చేయడం సాధ్యం కాదు. దేవుని పోలి నడుచుకోవడం ఆత్మీయ సత్యం కాకపోతే దేవుడు ఈ ఆజ్ఞ ఇచ్చేవాడే కాదు. ఆయన పెట్టని దానిని ఎత్తుకొనువాడు కాదు. భారతదేశంలో ఉండే ప్రతి విశ్వాసి దేవుని పోలి నడుచుకొనివుంటే, మన దేశంలో క్రీస్తు నెరుగని వ్యక్తి ఉండేవాడు కాదు అని చెప్పడంలో అతిశయోక్తి లేదేమో! ఈ పాపంలో నీకు నాకు భాగం లేకపోలేదు. ఆలోచించు.

– కె. డేవిడ్‌రాజ్ కుమార్, గుంటూరు



# సహవాసం మానకు
## సాగిపో ముందుకు

**(1 యోహాను 2:24)**

తన బిడ్డను సండేస్కూల్‌కు పంపుతూ, అక్కడ మంచి కథలు చెబుతారు, పాటలు నేర్పిస్తారు, ఆటలు ఆడిస్తారు, యేసుప్రభువును పరిచయం చేస్తారని చెప్పి పంపించారు. సండే స్కూల్‌నుండి తిరిగి వచ్చిన బిడ్డను చూచి సండేస్కూల్ "ఎలా ఉందిరా?" అని తండ్రి అడిగాడు. "డాడీ, మీరు చెప్పినవన్నీ చేయించారు గాని యేసుప్రభువును పరిచయం చేయలేదు" అని జవాబు ఇచ్చాడు. సండే స్కూల్‌లోనే ప్రభువును పరిచయం చేయకుంటే, పెద్దల మీటింగ్స్‌లో క్రైస్తవ మూల సత్యం, పునాదియైన "ప్రభువుతో సహవాస అనుభవం" లోనికి ఎప్పుడు వెళ్తారు? అని నిట్టూర్పుతో ఆలోచించి, ప్రార్థించ ప్రారంభించాడు.


సరిగ్గా, ఇదే పరిస్థితిని, ముఖ్యంగా, ఎఫెసీ సంఘ స్థితిని చూసి, తొంబై ఏండ్ల వయస్సులో చేతులు సరిగ్గా సహకరించకపోయినప్పటికీ క్రైస్తవ మూల సత్యమైన "సహవాసం" గూర్చి యోహాను రాశాడు. దేవుడు రాయించిన చివరి లేక అంతిమ ప్రత్యక్షత కూడా ఇదే. అదేమిటో యోహాను రాసిన మొదటి పత్రిక ఆధారంగా చూద్దాం.

### 1. సహవాసమంటే?

1. ప్రభువుతోను, ప్రభువు బిడ్డలతోను ఆత్మీయ చుట్టరికం, బంధుత్వం, సాంగత్యం (రిలేషన్‌షిప్). 2. భార్యాభర్తల సంబంధం మాదిరి, ప్రభువుతోను, ప్రభువు బిడ్డలతోను ఉండే అనుబంధం, కలిసి నడవడం (కంపానియన్‌షిప్). 3. ఆశయాలు, లక్ష్యాలు పెట్టుకొని, వాటిని సాధించడానికి స్థాపించబడిన సంస్థ లోని సభ్యుల మధ్య ఉండే సహకారం, భాగస్వామ్యమును (పార్టనర్‌షిప్) సహవాసమని, మూలభాషలో వాడిన 'కొయినోనియా' అనే పదాన్ని బట్టి అర్థ వివరణ తెలుస్తుంది. ఈ అర్థాలకున్న వాస్తవాలను, ఆచరణను బైబిల్ ఆధారంగా చూద్దాం.

సృష్టి ఆరంభం నుండి చూస్తే, దేవుడు మానవులను సృష్టించిన తర్వాత అస్తమయము ఉదయము అనేమాట వాడక, సదాకాలము మానవులు తనతో సహవాసం కలిగియుండే వీలు కల్పించాడు (ఆది 2:2,3). విశ్వాసులకు తండ్రియైన అబ్రహామునుండి సహవాస విందును స్వీకరించాడు (ఆది 18:8). ఇప్పటికిని సహవాసం కలిగి ఉందాము, రండి అని ఆహ్వానం ఇస్తున్నాడు (ప్రక 3:20).

కొత్తనిబంధనలో సహవాసమంటే – తోటి విశ్వాసులతో పంచుకోవడం (షేరింగ్), తమకున్నది త్యాగం చేసి ఆదుకోవడం (సెల్ఫ్‌శాక్రిఫైజ్) అనేదే ప్రధానంగా చూస్తాం. సహవాసపు సరదాలు లేవు. సువార్త యాత్రలే తప్ప సహవాసపు సరదా యాత్రలు లేవు.



**2. సహవాస నిర్వచనం (1యోహాను 1:1-5)**

దేవునితోను, తోటి విశ్వాసులతోను అన్యోన్యతగలిగి దేవుని పనిలో భాగస్వాములుగా తమకున్నది పంచుకొంటూ త్యాగపూరితముగా కలసి ముందుకు నడిచే విశ్వాసుల సాక్షి సమూహము యొక్క జీవన విధానము.

**3. సహవాస ఉద్దేశము**

దేవునిని, దేవుని పిల్లలను ఎరుగుట, ప్రేమించడం.

**4. సహవాస ద్వారాలు**

1. బైబిల్ చదివి, స్టడీ చేయడం, 2. ప్రార్థించి దేవుని స్వరం వినడం, 3) పరిశుద్ధాత్మ నడిపింపుకు లోబడటం, 4. చర్చికి క్రమంగా వెళ్ళడం అనే ద్వారాలు ద్వారా ప్రవేశించి దేవునితో సహవాసంచేసే వీలవుతుంది.

**5. సహవాస విశిష్టత**

ఈ సహవాసమును జాతి, రంగు, ప్రాంతము, కులగోత్రాలు, సామాజిక హోదా, ధన సంపదల మీద ఆధారపడి ఏర్పాటు చేసుకోలేదు. యేసుక్రీస్తు పవిత్ర రక్తంలో కడుగబడిన, పరిశుద్ధుల పవిత్ర సాక్ష్య సమూహ సహవాసం.

**ఈ సహవాస ప్రత్యేకతలు ఏమిటంటే?**

1. దేవుని చిత్తాన్ని ఎరిగి, దాని ప్రకారం జీవితాన్ని మలచుకోవడం.
2. దేవుని సారూప్యతలోనికి ఎదగటానికి వీలు కుదురుతోంది.
3. పాపంలో పడిపోకుండా కాపాడబడతాం.
4. లోకాన్ని ప్రభావితం చేసే సాక్ష్యాన్ని నెలకొల్పే సహవాసం.
5. సత్క్రియలు చేయడానికి వీలవుతుంది.
6. ఒకరి కొరకు ఒకరు ప్రార్థించుకొని, ఆత్మీయంగా బలపడగలం.
7. సాతానుని, లోకాన్ని, అహాన్ని సులభంగా జయించ వీలవుతుంది.
8. ఒకరినొకరు ప్రేమించుకొని, ప్రోత్సహించుకొనే సహవాసంగా సాగుతాం.
9. దైవిక సూచనలు, సలహాలు పొంది జీవిత మార్గ నిర్దేశకము చేసుకోవచ్చు.

**6. సహవాసాన్ని బ్రేక్‌చేసి భంగపరచేవి (1 యోహాను 2:18)**

సహవాసం పరిమళ వాసన వెదజల్లకుండా, దేవునికి దు:ఖం కలిగించే విషయాలు ఏమిటంటే..

1. **ఒప్పుకోని పాపం:** ప్రతి విశ్వాసి చనిపోయే వరకు పాపముతో పోరాడుతూనే ఉంటాడు. పాపపు మురికి అంటుతూనే ఉంటుంది. వెంటనే ఒప్పుకొని, కడుక్కోకపోతే సహవాసమంతా కంపుకొడుతూ ఉంటుంది (సామె 28:13).
2. **అవిధేయత:** దేవుని బిడ్డనని సహవాసంలో చేరి, దేవుని ఆజ్ఞలకు అవిధేయత చూపించే వారిలో సత్యముండదు. ఒక్కరి అవిధేయత సహవాసమంతటికి చుట్టుకొంటుంది. అబద్ధికులుగా మిగిలిపోవలసి వస్తుంది.
3. **ప్రేమరాహిత్యం:** ఎఫెసీయులు మొదటి ప్రేమను విడిచిపెట్టారని ప్రభువే చెప్పాడు (ప్రక 2:4). తోటి వారి పట్ల ప్రేమ లోపిస్తే, నరహత్యకు దారి తీస్తుంది (మత్తయి 5:21). దేవునితోను, తోటివారితోను సహవాసం బ్రేక్ అవుతుంది.
4. **ప్రాపంచికతత్వం:** లోకస్తులతో పోటీపడటంలో ఏమాత్రం తీసిపోను అని, భౌతిక ఆశలకు, కోర్కెలకు పెద్దపీట వేయటమే ప్రాపంచికతత్వం. ఇక క్రీస్తు ప్రేమతత్వం చూపించడం సాధ్యం కాదు.
5. **సత్యాన్ని వదలివేయడం:** తప్పుడు సిద్ధాంతాలు తలకెక్కించుకొని, సత్యాన్ని వదిలేస్తే దేవునితో సహవాసం చేయడం కుదరదు. తోటి వారికి దూరమవ్వటం తప్పదు.

**7. సహవాసాన్ని భద్రం చేసేవి (1 యోహాను 2:20-3:24)**

నిత్యం దేవునితో సహవాసము, తోటివారితో ఆత్మీయ చుట్టరికం వృద్ధి చేసుకోవాలంటే

1. **క్రీస్తులో నిలిచివుండాలి:** యోహాను 15:5లో

ప్రభువు చెప్పిన ప్రకారం తీగ ద్రాక్షవల్లిలో నిలిచి ఉన్నప్పుడే ఫలిస్తుంది. సహవాసం భద్రంగా ఉంటుంది.

2. **దేవుని బిడ్డలుగా జీవించాలి:** దేవుని బిడ్డలు అని అనిపించుకోవడం గొప్ప గుర్తింపు అయితే, అలా జీవించడం మరింత గొప్ప భాగ్యం ఈ లోకంలో.

3. **నిరీక్షణ:** క్రైస్తవ విశ్వాసం నిరీక్షణతో కూడినది. ప్రభువు మరలా వస్తాడు, మనలను తీసుకొనివెళ్తాడు అనే నిరీక్షణ గలవారు, ఆయన కొరకు ఎదురుచూస్తూ పనిచేస్తారు.

4. **పాపం జోలికి పోకూడదు:** విశ్వాసి పాపం చేయడు అని కాదు, పాపంలో కొనసాగడు. గొర్రె బురదలో పడితే, వెంటనే లేచి దులుపుకొన్నట్లు పశ్చాత్తాపపడి ఒప్పుకొని విడిచిపెడతాడు. సహవాసంలో తిరిగి కొనసాగుతాడు.

5. **తోటివారిపై ప్రేమ:** క్రీస్తు కల్వరి ప్రేమ అర్థమైనప్పుడు, ఆ త్యాగపూరిత ప్రేమను స్ఫూర్తిగా తీసుకొని, జీవిత చివరి క్షణం వరకు ఆ ప్రేమ కొరకే జీవిస్తాడు.

6. **ప్రార్థన:** యేసయ్య కల్వరి సిలువలో తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుము అనే ప్రార్థన అర్థమైతే, ఎల్లప్పుడు ప్రార్థిస్తూ దేవుని సహవాసములో వర్ధిల్లగలం.

7. **విధేయత:** ఒకనినొకడు ప్రేమించవలెననే ఆజ్ఞకు విధేయత చూపించినప్పుడు, దేవుని సంబంధుల ముగా కొనసాగగలం, సహవాసాన్ని భద్రం చేసుకోగలం.

### 8. సహవాస అప్రమత్తత (1 యోహాను 4వ అధ్యాయం)

1. **అబద్ధ ప్రవక్తలను పరీక్షించాలి:** యేసుక్రీస్తు దైవత్వాన్ని అంగీకరించి, ఆయన సిలువ రక్తం ద్వారానే నిత్యరక్షణ, పాపక్షమాపణ, పరలోక రాజ్యం అని చెప్పక, క్రీస్తు బోధకు వ్యతిరేకంగా మాట్లాడేవారి విషయంలో జాగ్రత్త వహించాలి.

2. **ప్రేమ విషయంలో అశ్రద్ధ పనికిరాదు:** దైవిక ప్రేమ తోటివారిని ప్రేమించేవారిగా చేస్తుంది, దేవునిలో ఉన్నామన్న నిర్ధారణ ఇస్తుంది. తీర్పు దినమున ధైర్యాన్ని ఇస్తుంది. భయాన్ని




పోగొడుతుంది. మన విశ్వాస వాస్తవికతను చూపిస్తుంది గనుక ప్రేమించే విషయంలో అల సత్వం, అశ్రద్ధ పనికిరాదు.

### 9. సహవాస ఫలితాల రుజువులు (1 యోహాను 5వ అధ్యాయం)

దేవునితో సహవాస ఫలితంగా విశ్వాసి జీవితంలో..

1. **జయజీవితం:** లోకంలో శ్రమలు, శోధనలు, పోరాటాలు ఎన్ని ఎదురైనా సహవాస బలంతో విజయం సాధిస్తాడు.

2. **సాక్షిగా నిలబడటం:** తన జీవిత విధానం, ప్రవర్తన, నీతి, నిజాయితీ, ఉన్నత ప్రమాణాలతో యేసుప్రభువుకు సాక్షిగా నిలబడతాడు.

3. **ప్రార్థన విజయాలు:** దేవుని చిత్తానుసారమైన ప్రార్థనతో లోకాన్ని జయిస్తాడు.

4. **నిశ్చయ విశ్వాసం:** రక్షణ, విశ్వాసముల విషయంలో స్పష్టమైన అవగాహన కలిగి ధైర్యముగా ముందుకు సాగుతాడు. దృఢమైన, సాహసవంతమైన జీవితాన్ని జీవిస్తాడు.

### 10. సహవాస వాగ్దానాలు

ప్రభువును, దేవుని ప్రజలను ప్రేమించి సహవాసంలో కొనసాగే వారికి...

1. నిత్యజీవం అనుగ్రహించబడుతుంది (2:25)
2. దేవుని రెండవ రాకడలో ధైర్యము (2:28)
3. క్రీస్తువలె మహిమ శరీరం పొందుతాము (3:2)
4. తీర్పు దినమందు ధైర్యం (4:17)
5. ఈ లోకంలో ధైర్యంగా సేవ చేసే భాగ్యం లభిస్తుంది.

## 11. సహవాస నిర్ధారణ పరీక్ష

మనం దేవుని సహవాసంలో ఉన్నామా? లేదా అని నిర్ధారించుకోటానికి మాత్రమే ఈ ప్రశ్నలు. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు వేసుకొంటే ఎన్ని మార్కులొస్తాయో చూసుకొందాం.

1. నేను క్రీస్తు రెండవ రాకడకు అనుగుణంగా, పవిత్రంగా జీవిస్తున్నానా? 3:2.

   అవును కాదు

2. నేను ఇంకను పాపంలోనే కొనసాగుతున్నానా? 3:6,9; 5:18

   అవును కాదు

3. నేను నా తోటి సోదరీ/సోదరులను ద్వేషిస్తున్నానా? 4:20

   అవును కాదు

4. నా తోటి సోదరీ/సోదరులకు సహాయం చేయాలనే తపన, వాంఛ నాలో ఉందా? 3:17

   అవును కాదు

5. నా తోటి సోదరీ/సోదరులను త్యాగపూరితంగా ప్రేమిస్తున్నానా? 4:7,21

   అవును కాదు

6. నేను దేవునిని నిజంగా ప్రేమిస్తున్నానా? 5:2

   అవును కాదు

7. నేను దేవుని బిడ్డలతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నానా? 4:6

   అవును కాదు

8. నేను ఎప్పుడూ ఆందోళన, భయంతో గడుపుతున్నానా? 4:18

   అవును కాదు

9. లోకాన్ని జయించే విశ్వాస శక్తి నాలో వుందా? 5:4

   అవును కాదు

10. యేసుక్రీస్తు దైవత్వం, ఆయన సిలువ కార్యంపై స్పష్టమైన అవగాహన కలిగి యున్నానా? 5:11,13,20

    అవును కాదు

మనమందరం పరీక్షించుకొనే సమయమిది. ప్రభువు మన ఆన్సర్ షీట్ చూస్తే సంతోషిస్తాడా? తోటి వారు చూస్తే మెచ్చుకొంటారా? మనకు మనం ఎన్ని మార్కులు ఇచ్చుకొంటాం. పరీక్షించుకొందాం. ప్రభువే మనకు వివేకమనుగ్రహించును గాక (2 తిమోతి 2:7)

ఒక విశ్వాసి/గ్రాడ్యుయేట్/స్టూడెంట్ సహవాసానికి ఎందుకు దూరమవుతాడు. అని వారెన్ వియర్స్‌బీ గారిని అడిగితే, ఆయన ముఖ్యంగా మూడు కారణాలు చెప్పాడు. 1. దేవుని చిత్తానికి అవిధేయత చూపించడం. 2. తోటి విశ్వాస క్రైస్తవులతో కలిసి నడవకపోవటం. 3. అబద్ధాన్ని నమ్మడం. ఆ ఫలితంగా అబద్ధ జీవితాన్ని కొనసాగిస్తుండడం అని చెప్పారు. ఒకవేళ మనలో కూడా అవి ప్రారంభమైనవేమో పరీక్షించుకొందాం. రక్షింపబడిన క్రొత్తలో దేవునితో, తోటివారితో ఉన్న సహవాసాన్ని తిరిగి పొందటానికి పశ్చాత్తాప హృదయంతో ప్రార్థనాపూర్వకంగా ప్రయత్నిద్దాం.

చిన్నపిల్లలారా! చిన్నపిల్లలారా! అని ఎనిమిది సార్లు నాటి క్రైస్తవ సహవాస సంఘ సభ్యులను పలకరించాడు. ఆ పలకరింపులో ఆప్యాయత, అనురాగం, కుటుంబ బాంధవ్యం, నమ్రత, విశ్వాసం, నేర్చుకోవాలి, నేర్పించాలనే హృదయభావనలు, గుండెసవ్వడి గోచరమౌతున్నాయి. అప్పటికే అపోస్తలులంతా హతసాక్షులయ్యారు. డొమిషియన్ అనే క్రూరమైన రోమా చక్రవర్తి పెట్టే శ్రమలు సహిస్తూ, యేసు రొమ్మున ఆనుకొన్న శిష్యునిగా, పెద్దవానిగా, చిన్నపిల్లలారా, సహవాసము చేయమానకండి, సాగిపోండి అని యోహాను ముందుకు పురికొల్పుతున్నాడు. పౌలు భక్తుడు కూడా ఇదే ఆవేదనను తెలియజేస్తున్నాడు (హెబ్రీ 10:24). మన యుఇయస్ఐ స్థాపకులలో ఒకరైన డా॥ స్టైరట్ గారు 'జీసస్ కమాండెడ్ అజ్ సమ్‌థింగ్ టు డూ, లవ్ వన్ అనెదర్' అనే పాట రాసి నాటి స్టాఫ్, స్టూడెంట్స్, గ్రాడ్యుయేట్స్‌ను బ్రతిమిలాడి, సమాధానపరిచారు. వదిలిపోవద్దు, కొనసాగండి.

కాబట్టి, మన క్షేమమును కాంక్షించి కోరి వారు ఇచ్చిన ప్రోత్సాహాన్ని, హెచ్చరికగా తీసుకొని దేవుని సహవాసాన్ని వీడక ఒకరినొకరము ప్రోత్సహించుకొంటూ సహవాసంలో సాగుదాము. అలా చేయడానికి ప్రభువు మనందరికి సహాయం చేయును గాక! ఆమెన్.

**– ఆర్. ప్రభుదాస్,** తెనాలి

# పవిత్రంగా జీవిద్దాం

## పరిచయం

లైంగిక పాపము ఒక అంటువ్యాధిలా ప్రబలుతుంది. రోజువారీ సంభాషణలలో, సినిమాలలో, సంబంధాలలో దీని గూర్చిన ప్రస్తావన రోజు రోజుకి పెరిగిపోతుంది. నేటి సాహిత్యం, సంగీతం, పాటలు కూడా ఈ పాపాన్ని ప్రోత్సహించేలా ఉంటున్నాయి. ఈ పాపాన్ని మనము వెదకాల్సిన అవసరం లేదు గానీ అదే మనలను వెంటాడుతూ ఉంది. ఒక ముఖ్యమైన విషయం కోసం గూగుల్‌లో సెర్చ్ చేస్తుంటే పక్కనే మనము ఊహించని విధంగా ఈ పాపాన్ని ప్రేరేపించే ప్రకటనలు, చిత్రాలు ప్రత్యక్షమై శోధిస్తూ ఉంటాయి. ఈ పాపముతో శోధింపబడని వ్యక్తి ఉండడనేది అక్షర సత్యం. పోర్నోగ్రఫీతో లక్షల కోట్ల వ్యాపారం జరుగుతుందంటే మనం ఎంత అపవిత్ర లోకములో జీవిస్తున్నామో అర్థం చేసుకోవచ్చు.

## క్రైస్తవ్యంలో అపవిత్ర మరకలు

లైంగిక పాపములో పడిపోయిన సేవకుడు, సంఘములో ఉన్న అమ్మాయిని అత్యాచారం చేసిన పాస్టర్ గారు, అక్రమ సంబంధం పెట్టుకొన్న విశ్వాసి, మేము పోర్నోగ్రఫీ చూస్తామని ప్రకటించే సేవకులు, వివాహం కాకుండానే లైంగిక పాపములో పడిపోయిన విశ్వాసులు, అమ్మాయిలు- అమ్మాయిలతోనూ, అబ్బాయిలు-అబ్బాయిలతో లైంగిక సంతోషం కోసం పాపము చేస్తున్న సంఘటనలు ఈ లోకములోని అవిశ్వాసుల్లోనే కాదు మన క్రైస్తవ సమాజములో కూడా వెలుగు చూస్తున్నాయి.

## బైబిల్లోని వ్యక్తులు

దేవుని హృదయానుసారుడు అని పిలువబడిన దావీదు పడిపోయాడు. బలశాలి అయిన సంసోనూ ఈ పాపములో చిత్తు చిత్తుగా ఓడిపోయాడు. గొప్ప జ్ఞానియైన సొలోమోను పడిపోయాడు. గొప్ప గొప్ప సేవకుల చేత వాక్య బోధను పొందిన కొరింథీ సంఘము వారు కూడా పడిపోయారు. మన తరంలోనే గొప్ప ప్రార్థనాపరులు, వాక్యబోధకులు ఈ పాపములో పడిపోయి తమ సాక్ష్యాన్ని, పరిచర్యను నాశనం చేసుకొన్నవారు కోకొల్లలు. వారికంటే మనము బలవంతులం కాదు కాబట్టి ఈ లైంగిక పాపము విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి, భయపడాలి. మన భక్తి, గత ఆధ్యాత్మిక విజయాలు



"దేవుడు మన నుండి ఆశించేది ప్రాథమికంగా పరిచర్య కాదు, ఈ అపవిత్ర లోకములో పరిశుద్ధమైన జీవితాన్ని. లైంగికమైన అపవిత్రతలో పడిపోవడం అంటే దేవుడు నీ శరీరాన్ని ఏ మహిమగల ఉద్దేశముతో చేశాడో దానిని తృణీకరించడమే"

ఈ పాపము విషయములో మనకు విజయాన్ని హామీని ఇవ్వవు కాబట్టి ఈ పాపము విషయంలో జాగ్రత్తగా ఉంటూ ప్రతిరోజూ ప్రభువు కృప మీద ఆధారపడుతూ జీవించవలసిన అవసరము ఉన్నది.

## కావాల్సింది పరిశుద్ధతే

"ప్రపంచానికి కావాల్సింది క్రైస్తవుల యొక్క వ్యక్తిగత పరిశుద్ధత" అని జే ఐ పేకర్ అనే భక్తుడు అంటాడు. "నా సంఘానికి కావలసినది నా యొక్క వ్యక్తిగత పరిశుద్ధత" అని ఇంకో దైవజనుడు అంటాడు. దేవుడు మన నుండి ఆశించేది ప్రాథమికంగా పరిచర్య కాదు, ఈ అపవిత్ర లోకములో పరిశుద్ధమైన జీవితాన్నే. ఈ పాపపు అంధకారంలో ఉన్న లోకములో పవిత్రముగా జీవిస్తూ లోకానికి వెలుగుగా ఉండాలని, నైతికమైన రుచిని కోల్పోయిన ఈ లోకానికి మన పవిత్ర నైతిక జీవితాల ద్వారా రుచినిచ్చే ఉప్పుగా ఉండాలని దేవుడు ఆశిస్తున్నాడు.

ఈ వ్యాసములో, లైంగిక పాపాల గురించి బైబిల్ ఏమి చెబుతుంది, వాటినుండి మనలను మనము కాపాడుకొంటూ ఎలా పవిత్రముగా ఎలా జీవించగలమో అనే సంగతులను పరిశీలిద్దాం.

## 1. వివాహేతర లైంగిక క్రియలు

వివాహానికి ముందు, వివాహానికి బయట జరిగే లైంగిక క్రియలు పాపమని బైబిల్ చెబుతుంది. "జారత్వానికి దూరముగా ఉండుట దేవుని చిత్తమని" (1 థెస్స 4:3), "జారత్వమునకు దూరముగా పారిపొమ్మని" (1 కొరింథీ 6:18), "జారులతో సాంగత్యం చేయవద్దని" (1 కొరింథీ 5:9), "మీలో జారత్వము ఉండకూడదు.. దాని పేరే ఎత్తకూడదు" అని (ఎఫెసీ 5:3), "జారత్వము జరిగించువాడు బుద్ధిశూన్యుడు, తనకు సర్వ నాశనమును కొరువాడే" అని (సామెతలు 6:32), "క్రీస్తుకు అవయవములమై ఉన్న మన శరీరాలను వేశ్య యొక్క అవయవములుగా చేయడం తగదు" అని (1 కొరింథీ 6:15), దేవుని ఆలయమై ఉన్న మన దేహాలను ఎలా వ్యభిచార గృహాలుగా చేస్తామని దేవుని వాక్యం చెబుతుంది.

వివాహానికి వెలుపల శృంగారాన్ని దేవుని వాక్యము ఖండిస్తుంది. వివావానికి ముందు సెక్స్‌ను దేవుడు అంగీకరించడు అసహ్యించుకొంటాడు, చాలా తీవ్రముగా పరిగణిస్తున్నాడు.

లైంగికమైన అపవిత్రతలో పడిపోవడం అంటే దేవుడు నీ శరీరాన్ని ఏ మహిమగల ఉద్దేశముతో చేశాడో దానిని తృణీకరించడమే అవుతుంది.

## ఈ పాపము నుండి మనల్ని మనం ఎలా భద్రపరచుకోవాలి?

### 1. యౌవ్వనేచ్ఛల నుండి పారిపోవాలి (2 తిమోతి 2:22)

పౌలు యౌవనస్థుడైన తిమోతికి రాస్తూ యౌవన కోరికలు, ఆశలకు వ్యతిరేఖముగా పోరాడమని, యుద్ధం చెయ్యమని చెప్పకుండా, పరుగెత్తమని అంటున్నాడు. ఇది అక్కడే నిలబడి జయించే పాపము కాదు గానీ అక్కడ నుండి పారిపోయి జయించే పాపము, ఇది ఒక సలహా కాదు గానీ ఆజ్ఞ.

యోసేపు ఈ శోధన ఎదుర్కొన్నప్పుడు పోతీఫరు భార్య దగ్గరే ఉండి ఆ లైంగిక శోధనను జయించలేదు గానీ అక్కడనుండి, ఆమెనుండి దూరంగా పారిపోయాడు కాబట్టే పాపాన్ని జయించగలిగాడు. లేకపోతే ఓడిపోయేవాడు.

### 2. ఒప్పుకొని విడిచిపెట్టాలి

మన ఆలోచన, చూపులు, క్రియల్లో ఇలాంటి పాపముంటే మనము ఆయన సన్నిధిలో పశ్చాత్తాపంతో ఒప్పుకొని విడిచిపెట్టాలి. కొరింథీ సంఘస్తులు కూడా ఒకప్పుడు ఈ పాపములో ఉన్నప్పటికీ దేవుడు వారిని క్షమించి పవిత్రపరచాడు.

### 3. ఆపోజిట్ సెక్స్‌తో ఏకాంతంగా ఉండకూడదు

ఏకాంతముగా ఆపోజిట్ సెక్స్‌తో ఎక్కువ సమయం గడుపుతూ ఉంటే నువ్వు ఎంత ఆత్మీయుడవైనా ఏదో ఒక సమయంలో ఆకర్షితుడవు అవుతావు. "ఒక పరిశుద్ధుడు తన హృదయం త్వరగా నిప్పంటుకునే వస్తువులాంటిదని గ్రహించి, శోధనా నిప్పురవ్వల నుంచి తన హృదయాన్ని కాపాడుకొంటాడు" అని జేసి రైల్ అంటాడు.



#### 4. ఒంటరిగా ఉండకూడదు

యౌవ్వనస్థులు ఒంటరిగా ఉండకూడదు ...మీరు ఎంత భక్తిపరులైనా, కమిటీ మెంబర్స్ అయి-నా, ఆపోజిట్ సెక్స్‌తో కలసి ఒంటరిగా ప్రార్థన చేయడం, వాక్యము చదవడం, ఒంటరిగా వారితో కలసి పనిచేయడం, వారితో ఎక్కువగా మాట్లాడడం, చాటింగ్ చేయడంవంటివి చేయకూడదు.

వివాహము అయినవారు కూడా ఈ పాపానికి మినహాయింపు కాదనే విషయాన్ని గుర్తించాలి. దావీదు అనేకమంది భార్యలు ఉన్నాగానీ ఈ పాపములో పడిపోయాడు. సొలొమోను కూడా వివాహము తర్వాతనే పడిపోయాడు. అనేకమంది గొప్ప దైవజనులు కూడా ఈ లైంగికమైన పాపములో పడిపోయి తమ సాక్ష్యాన్ని, పరిచర్యను, కుటుంబాలను పాడుచేసుకొన్నారు. కాబట్టి వివాహమైన వారు కూడా ఈ పాపము విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి.

ఈ పాపము మన కుటుంబం, పరిచర్య, సాక్ష్యానికి అవమానాన్ని, సిగ్గును తెస్తుంది గనుక జాగ్రత్తగా ఉండాలి.

#### 5. ఆత్మీయంగా బలహీనులం కాకూడదు

ఆత్మీయంగా బలహీనులమైతే ప్రతి విషయంలో ఓడిపోతాం. అందుకనే ప్రార్థన, దేవుని వాక్య పఠనం, అధ్యయనం, సహవాసం, సంఘాన్ని ఎప్పుడూ నిర్లక్ష్యం చేయకూడదు.

### 2. పోర్నోగ్రఫీ

ఒక సేవకుల సదస్సులో 90% మంది మేము పోర్నోగ్రఫీ చూస్తామని చెప్పారు అంటే ఈ పాపము యొక్క తీవ్రత ఎంతో మనం అర్థము చేసుకోగలం. కోవిడ్ సమయంలో కూడా దాదాపు 95 శాతము మంది యవ్వనస్థులు గంటల తరబడి అశ్లీల చిత్రాలు చూశారని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. మన రాష్ట్రంలో ఉన్న అనేక మంది విశ్వాస విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ కూడా ఈ ఊబిలో కూరుకొనిపోయి తమ జీవితాలను అపవిత్రపరుచుకొంటున్నారు. మనము పోర్నోగ్రాఫిక్ సంస్కృతిలో జీవిస్తున్నాము. పోర్న్‌కి బానిసలైన వారు మానసిక ఆందోళనకు, అపరాధ భావనకు గురవుతారని అధ్యయనాలు చెబుతున్నాయి.

#### పోర్నోగ్రఫీ దేవుని వాక్యానికి ఎందుకు విరుద్ధం?

సెక్స్ వివాహ పరిధిలో ఉండాలని దేవుని వాక్యం చెబుతుంది. ఈ పోర్న్ చూస్తున్నప్పుడు మనము దేవుని స్వరూపములో చేయబడిన ఒక స్త్రీని లేదా పురుషున్ని ఒక లైంగిక వస్తువులాగా చూస్తాము, అది ఘోరమైన పాపము. దేవుని స్వరూపంలో చేయబడిన ఒక వ్యక్తిని మన యొక్క కోరికలను సంతృప్తిపరచడానికి ఒక వస్తువులాగా వాడుకోవడం అనేది ఘోరమైన సంగతి. అంతేకాకుండా ఇలాంటి హేయమైన విషయాలను మనం సమ్మతిస్తున్నట్లు, ప్రోత్సహిస్తున్నట్లు. ఒక స్త్రీని మోహపు చూపుతో చూస్తే అప్పుడే అతను హృదయమందు ఆమెతో వ్యభిచారము చేసినవాడు అని యేసు చెప్పాడు (మత్తయి 5:28). ఈ పాపము చూడటంతోనే ఆగిపోదు, క్రియారూపం దాల్చడానికి దారితీస్తుంది. అశ్లీల దృశ్యాలు చిత్రాలు చూసేవారు సెల్ఫ్ అబ్యూజ్ అనే పాపానికి బానిసలైపోతారు. దేవుడు దీనిని అసహ్యించుకొంటాడు.

#### ఈ పాపాన్నుంచి బయటపడడం ఎలా?

1. పోర్నోగ్రఫీ చూడడం దేవుని దృష్టిలో పాపమని నువ్వు గుర్తించి ఒప్పుకోవాలి.
2. ఈ పాపములో ఎంత ఎక్కువకాలం కొనసాగితే బయటకు రావడం అంత కష్టము కాబట్టి, ప్రారంభంలోనే ప్రభువు సన్నిధిలో పశ్చాత్తాపపడాలి.
3. నీ శక్తితో ఈ పాపమునుండి బయటకు రాలేవని గుర్తించి ప్రభువు సహాయము కొరకు ప్రార్థించు.
4. రాత్రి సమయములో ఒక్కడివే ఉన్నప్పుడు, ఒంటరిగా ఉంటున్నప్పుడు మొబైల్ లేదా ల్యాప్‌టాప్‌తో సమయము గడపవద్దు. ఒక్కడివే రూమ్‌లో ఉన్నప్పుడు మొబైల్ లేదా ల్యాప్‌టాప్‌ను చూడాల్సివస్తే కిటికీలు, తలుపులు తెరచి ఉంచుకోవాలి.
5. నీ ఆత్మీయ జీవితాన్ని గూర్చి అడిగేందుకు ఒక నమ్మకమైన అన్నను, అమ్మాయిలైతే అక్కను లేదా స్నేహితులను నియమించుకోవాలి. వారితో కలసి ప్రార్థన చేయాలి.
6. ప్రతి క్షణము కూడా ఈ పాపము విషయంలో మెలకువగా ఉండాలి, పోరాడాలి.
7. దేవుని వాక్యము చదవడంలో, ధ్యానించడంలో, ప్రార్థించడంలో ఎక్కువ సమయాన్ని గడపాలి

8. “సోమరియైన వాడు తనను శోధించడానికి అపవాదిని శోధిస్తాడని” ఒక భక్తుడు అన్నాడు. గనుక నీవు సోమరిగా ఉండకుండా, చదువులో లేదా ఏదో ఒక పనిలో, దేవునితో గడుపుతూ ఉండాలి.

## 3. స్వలింగ సంపర్కం

ఈ మధ్య కాలంలో త్వరగా వ్యాప్తిచెందుతున్న మరో ప్రమాదకరమైన అంశము ఏంటంటే స్వలింగ సంపర్కం. అనేకమంది సెలబ్రిటీలు బాహాటంగానే, సిగ్గులేకుండా మేము స్వలింగ సంపర్కులమని ప్రకటించుకొంటున్నారు. ఇదే సమస్య క్రైస్తవ సమాజంలోనికి కూడా ప్రవేశించింది. అది చాలా బాధాకారమైన అంశము.

### దేవుని వాక్యం దీని గూర్చి ఏమని చెబుతుంది?

ఇది తుచ్ఛమైన అభిలాష అని దేవుని వాక్యము చెబుతుంది (రోమా 1:26-27). “స్త్రీ శయనము వలె పురుష శయనము కూడదు; అది హేయము....ఒకడు స్త్రీతో శయనించినట్టు పురుషునితో శయనించిన యెడల వారిద్దరు హేయక్రియను చేసిరి గనుక వారికి మరణశిక్ష విధించవలెను” (లేవీ 18:22; 20:13). ఈ పాపము నిమిత్తమే దేవుడు సొదొమ, గొమొఱ్ణా పట్టణస్తులను నాశనము చేశాడు (ఆది 19వ అధ్యాయం).

### ఈ పాపాన్నుంచి బయటపడడం ఎలా?

1. మొదటిగా ఇది బయోలాజికల్ సమస్య కాదని, దేవునికి వ్యతిరేకమైన ఆధ్యాత్మిక పాపమని, ఇది దేవుని యొక్క సృష్టి క్రమానికి, దేవునికి విరోధమైన పాపమని మనము గుర్తించాలి.
2. అది స్వాభావిక విరుద్ధమైన ధర్మము అని దేవుని వాక్యము చెబుతుంది గనుక భావోద్రేకాలు కలుగుతున్నప్పుడు దేవుని సన్నిధిలో పశ్చాత్తాపపడి ప్రార్థించు.
3. అలాంటి పాపము చేసే వారిని ఆ పాపానికి దేవుడు అప్పగించాడు అని అదే వాక్యము చెబుతుంది.
4. దీనిని హార్మోనల్ సమస్య అని సమర్థించకుండా ఇది ఆత్మీయ సమస్య అని ఒప్పుకోవాలి
5. ఇతరుల యొక్క ప్రార్థనా సహాయాన్ని తీసుకొని ఈ పాపమునుండి బయటపడాలి.
6. స్వలింగ సంపర్కులకు దగ్గరగా కాకుండా దూరముగా ఉండడం, దూరముగా పడుకోవడంవంటివి చేయాలి.
7. దేవుడు దీనిని అర్థము చేసుకొంటాడనే భావన నుండి ఆయన అసహ్యించుకొంటాడు అనే అవగాహన లోనికి మనము రావాలి.

### ముగింపు

లైంగిక పాపాలలో పడిపోయిన వారిని సాతాను నిరుత్సాహపరచి దేవుడు నిన్నిక అంగీకరించడు, ఆయనకు నువ్వంటే ఇష్టం లేదని నిన్ను కృంగదీస్తాడు. దేవుడు పాపాల్ని సహించడు గానీ నువ్వు యధార్థమైన హృదయముతో ఆయన సన్నిధిలో నీ పాపం విషయమై పశ్చాత్తాపపడి ఆ పాపాన్ని అసహ్యించుకొని విడిచిపెట్టడానికి ఇష్టపడితే, ఆయన నిన్ను క్షమించి తన కుమారుని రక్తములో కడిగి పరిశుద్ధపరచి, ఈ లైంగిక పాపాల మీద విజయం సాధించడానికి కావాల్సిన శక్తిని, సహాయాన్ని ఇస్తాడు. అయితే ఇక్కడ ప్రశ్న ఏమిటంటే... నువ్వు ఒకవేళ ఈ పాపాలలో ఉంటే అవి పాపమని అంగీకరిస్తున్నావా? ఆ పాపాన్ని అసహ్యించుకొంటున్నావా? విడిచిపెట్టడానికి సిద్ధంగా ఉన్నావా?

లైంగిక అనైతికత రాజ్యమేలుతున్న లోకములో పవిత్రంగా జీవించడం కష్టతరమైనదే కావొచ్చు గానీ అసాధ్యం కాదని గ్రహించాలి. మనలో ఉన్న పాపపు స్వభావం, లోకములో ఉన్న లైంగిక అపవిత్రత, మన మీద నిత్యము దాడి చేస్తున్న అపవాది ఈ మూడు కూడా మనలను లైంగిక పాపములో పడవేయడానికి, మనల్ని పాడు చేయడానికి ఎల్లప్పుడు తమ శాయశక్తులా పనిచేస్తూ ఉంటాయి. మేము విశ్వాసంలో వీరులం, శూరులం అన్న గొప్పవారు కూడా ఈ పాపములో పడిపోయి తమ సాక్ష్యాన్ని, పరిచర్యను కోల్పోయిన వారు మన కళ్ళెదుటే అనేకమంది ఉన్నారు. ఈ పాపము విషయంలో ఎవరూ సంపూర్ణ బలవంతులు ఉండరు. ఈ లోకములోని అపవిత్రతనుండి మనలను మనము కాపాడుకోవడం మన శక్తి ద్వారా సాధ్యమయ్యే పని కాదు అని గుర్తించాలి. మానవ సలహాల ద్వారా కాదు గానీ దేవుని వాక్యపు వెలుగులో ఈ పాపాన్ని మనము చూడాలి, ఆ వాక్య సహాయముతోనే ఈ పాపము నుండి మనము విజయాన్ని చూస్తాము.

– డా. పి. నాసరయ్య, వైజాగ్

# బలహీనతల నుండి బయటపడటం ఎలా?




ప్రతిమనిషికి కొన్ని బలహీనతలు ఉంటాయి. వాటిని గుర్తించి సరిచేసుకోకపోతే అవి బానిసత్వంలోకి తీసుకెళతాయి. కొన్నిసార్లు వాటిని వదిలించుకోవాలనుకున్నా అవి వదలవు. కొన్నిసార్లు మనమే వాటిని వదలకుండా గట్టిగా పట్టుకుంటాము. ఒక విశ్వాసికి బలహీనతల గురించి దేవుని వాక్యం ఏమి చెబుతుంది? వాటి నుంచి ఎలా బయటపడాలి? ఒకవేళ వాటిలోనే కొనసాగితే వచ్చే నష్టాలేంటి? మొదలగు విషయాలను ఈ వ్యాసంలో చూద్దాం.

## ప్రాధాన్యతలు ఏంటి?

ఇది 20సంవత్సరాల క్రితం జరిగిన సంఘటన. ప్రపంచకప్ క్రికెట్ జరుగుతుంది. అన్ని దేశాలను ఏ, బి, గ్రూపులుగా విభజించి ఎప్పుడు ఎవరు, ఎక్కడ ఆడబోయే వివరాలు ఒక పేపరుపై ముద్రించి పంచిపెట్టారు. నాకూ ఒక కాగితం దొరికింది. దాని ప్రకారం ఉదయం కొంతసేపు టివి చూసేవాణ్ణి. అలా మూడురోజులు చూసిన తర్వాత నా మనస్సు క్రికెట్‌తో నిండిపోయింది. ఎవరు నెగ్గుతారు? ఎవరు ఫైనల్‌కు వస్తారు? ఇలా నా మనసంతా క్రికెట్టే. పండుకున్నప్పుడు, ఉదయాన్నే లేచినప్పుడు ఒక్కటే ఆలోచన క్రికెట్...క్రికెట్. ఆ తర్వాత నాకు బుద్ధివచ్చింది. దివారాత్రం దేవుని వాక్యాన్ని ధ్యానించాల్సిన నేను క్రికెట్‌ను ధ్యానిస్తున్నాను. అదే నా ప్రాధాన్యత అయింది. ఎంత బుద్ధిహీనత! పగలు రాత్రి ధ్యానించడానికి దేవుడు 66 పుస్తకాలతో కూడిన బైబిల్‌ను ఇస్తే, దానికి బదులు వేరొక దాన్ని గురించి ఆలోచించడం ఎంత బుద్ధిహీనత! తర్వాత దేవుడు నన్ను గద్దించి ఈ బలహీనత నుంచి విడిపించాడు.

మనిషిని పాడుచేసేది మనిషి పాపమే. పాపమంటే దేవుని ఆజ్ఞలకు అవిధేయత, లేక దేవుని చిత్తాన్ని అనుసరించకపోవడమే. ప్రతి మనిషికి క్షేమము, లాభము, దీవెన, ఆశీర్వాదము ఆయన ఆజ్ఞలను అనుసరించడంలోనే ఉన్నది. అయితే మనిషిలోని పాపము దేవుని చిత్తాన్ని చేయనివ్వదు. మనలోనున్న పాపం నుండి మనల్ని విడిపించడానికే దేవుడు తన కుమారుణ్ణి ఈ లోకానికి పంపాడు. అందుకే ప్రభువు దూత యోసేపుతో "ఆమె యొక కుమారుని కనును; తన ప్రజలను వారి పాపములనుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు యేసు అను పేరు పెట్టుదువనెను" (మత్తయి 1:21). మన ప్రభువు సజీవుడు. ఆయన మరణాన్ని జయించి తిరిగి లేచి

తండ్రి కుడిపార్శ్వమున ఆసీనుడైయున్నాడు. ఆయన సర్వాధికారియైన ప్రభువు. మనల్ని ప్రతిపాపం నుండి విడిపించడానికి ఆయన తగినవాడు.

## మోహపు చూపు

నేను రక్షణ పొందినప్పుడు నా వయస్సు 23 సంవత్సరాలు. ఆంధ్రాయూనివర్శిటీలో రీసెర్చ్ స్కాలర్‌గా ఉన్నాను. బైబిల్ చదువుతున్నప్పుడు "ఒక స్త్రీని మోహపు చూపుతో చూచు ప్రతివాడు అప్పుడే తన హృదయమందు ఆమెతో వ్యభిచారము చేసినవాడగును" (మత్తయి 5:28) అని చదివాను. నాకు చాలా ఆశ్చర్యమనిపించింది. ఇది మనిషికి సాధ్యమేనా? అనే ప్రశ్న వచ్చింది. చూపుల్లో కూడా పాపం చేయని పురుషుడు ఉన్నాడా? అనే మరో ప్రశ్న. ఏది ఏమయినా చెడ్డచూపులు చూడకుండా జీవించడం ప్రభువు చిత్తం గనుక నేను ఏ అమ్మాయిని కూడా మోహపు చూపుతో చూడకూడదు అని నిర్ణయించుకున్నాను. ఎంతగానో ప్రయత్నించాను. పట్టుదలతో ప్రయాసపడుతున్నాను. అయినప్పటికీ నాకు ఎంతమాత్రం జయం రాలేదు. రోజులు, వారాలు, నెలలు గడిచిపోతున్నాయి. ఒకరోజు విజయవాడలో సైకిల్ తొక్కుకుంటూ ఇంటికి వస్తున్నాను. నా మనస్సులో ఇదే విషయం ఉంది. సైకిల్ తొక్కుతూనే దేవునితో "ప్రభువా, నా రెండు కళ్ళు తీసివేయి" అని ప్రార్థించాను. ఎందుకంటే కళ్ళతో పాపపు చూపు చూడకుండా ఉండటం అసాధ్యం అనిపించింది. తర్వాతి రోజు ఎంత ఆశ్చర్యము! దేవునిని అడిగాను, ప్రభువా నా రెండు కళ్ళు మార్చివేశావా? అని. నా జీవితంలో మోహపు చూపు చూడకుండా ఉండడం దేవుని వలనే సాధ్యమైంది. నా పట్టుదల, ప్రయాస వలన సాధ్యం కానిది కేవలం దేవుని వల్లనే సాధ్యమైంది.

ఈ విషయాన్ని రాస్తుంటే మార్టిన్ లూథర్ చెప్పిన మాటలు జ్ఞాపకానికి వస్తున్నాయి. ఆయన కనుగొన్న గొప్ప సత్యం "విశ్వాసము మాత్రమే". మానవుడు తన పాపం నుండి కేవలం ప్రభువైన యేసునందలి విశ్వాసము వలన మాత్రమే రక్షణపొందగలడు. అంటే తన పాపాలన్నిటికి పాపక్షమాపణ పొందగలడు. దీని గురించి ఇంకా ఎక్కువగా ధ్యానిస్తే మనకు అర్థమయ్యే సత్యమేమంటే ప్రభువు సిలువపై రక్తాన్ని కార్చి ప్రాణాన్ని అర్పించాడు. ఆయన జరిగించిన సిలువ యాగం ద్వారా మాత్రమే మనిషి పాపక్షమాపణ పొందుతాడు. ఆ ప్రభువు మనందరికోసం మరణించి, సమాధిలో మూడు దినాలుండి, మూడవ దినాన తిరిగిలేచి పరలోకమందు తండ్రి సింహాసనంపై ఆసీనుడయ్యాడు. పరిశుద్ధాత్మను మనందరి కొరకు అనుగ్రహించాడు. ఆయన జరిగించిన ఈ గొప్ప కార్యం వల్లనే ప్రతి మనిషి, ప్రతి విశ్వాసి తన బలహీనతలనుండి జయం పొందగలడు.

మన బలహీనతల్ని ఎలా గుర్తించాలి? వాటినుండి ఎలా బయటపడాలి? నేనర్థం చేసుకొన్న గొప్పసత్యమేమిటంటే "నేను పాపానికి అమ్మబడినవాడను. రక్షణ పొందినా ఆ పాపస్వభావం, బలహీనతలు ఇంకా నాలో నిలిచి ఉన్నాయి. నా స్వంత ప్రయత్నాలు, పట్టుదల వల్ల ఈ బలహీనతల మీద విజయం పొందలేనని అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను. అయితే నేను సంపూర్ణంగా ప్రభువుపై ఆధారపడినప్పుడు నాకు జయం కలిగింది. నా శక్తి, నా పట్టుదలమీద కొంచెము కూడా ఆధారపడలేదు. విశ్వాసం ద్వారా క్రీస్తుమీద మాత్రమే ఆధారపడ్డాను.

## చెడ్డమాటలు, దూషణ

1 పేతురు 2:1-3లో సమస్త దూషణ మాటలను మానుము అని ఉంది. మారుమనస్సు పొందిన నేను ఇతరులను ఎవ్వరినీ చెడ్డమాటలతో దూషించకూడదు అని అనుకున్నాను. ఎంత ప్రయత్నించినా సాధ్యం కాలేదు. ప్రభువుపై సంపూర్ణంగా ఆధారపడినప్పుడే అది సాధ్యమయ్యింది. అసూయ, మోహమాటంతో అబద్ధాలు చెప్పడం నాకు సాధ్యమయ్యేది కాదు. కానీ ప్రభువు వలన సాధ్యమైంది.

మన బలహీనతల నుండి మనం బయటపడాలంటే మన పట్టుదల, బలం మీద ఎంత మాత్రం ఆధారపడకుండా ప్రభువుకు మన బలహీనత అంతా చెప్పుకోవాలి. ఏమీ దాచకుండా చెప్పుకోవాలి. ఆయన కృపకోసం మాత్రమే ఎదురుచూడాలి. అప్పుడు ప్రభువు వలన వాటినుండి బయటపడతాము.

## అతిగా తినడం

మనలో ప్రతిఒక్కరం సమయానికి ఆహారం తినాలి. బలంగా, ఆరోగ్యంగా ఉండాలి. సరిగ్గా ఆహారం తీసుకోకపోతే కడుపులో ఆమ్లాలు పెరిగి అనారోగ్యానికి గురిచేస్తాయి.

అయితే మరికొందరిలో దుష్టుడు అతిగా తినేటట్లు



చేస్తాడు. ఎంత తినాలో అంత మాత్రమే తినకుండా అవసరానికి మించి తినడం మన ఆరోగ్యానికి హానికరం. అది శరీర బరువు పెరిగి గుండె జబ్బులకు కారణం అవుతుంది. దేవుని మార్గాలనుండి కుడికి వెళ్ళినా, ఎడమకు వెళ్ళినా నష్టమే. ఎక్కువగా తినడం సాతాను శోధన. మన ఆరోగ్యాన్ని దొంగిలించడానికి అతిగా తినేటట్లు వాడు ప్రేరేపిస్తాడు. ఈ విషయంలో మెలకువ కలిగివుంటే ఈ శోధనను జయించడం సులభం. ఈ పాపంనుండి విడుదలకు ప్రభువును ఆశ్రయించాలి.

## అబద్ధాలు చెప్పటం

ఆయనకు 60 సంవత్సరాలు దాటాయి, మారుమనస్సు పొంది 40 సంవత్సరాలు దాటాయి. అయినా ఇంకా అబద్ధాలు చెబుతాడు. ఏంటండీ ఇదీ! అంటూ మనుష్యులు మాట్లాడతారు. ఏమండీ వారు దేవుని సేవకులు, గత 30 సంవత్సరాల నుండి దేవుని మందిరంలో సేవకులుగా ఉంటున్నారు. అయినా నోరు విప్పితే అబద్ధాలే. ఈమె మా మందిరంలో పెద్ద. ఒట్టి అబద్ధాల పుట్ట అని అంటుంటారు.

విశ్వాసులమైన మనం అబద్ధాలు ఆడవచ్చా? ఏమండీ, మేము మందిరంలో దైవసేవకులం. అబద్ధాలు చెప్పకపోతే గొడవలు అయిపోతాయి. నిజాలు చెబితే కొందరికి విరోధులం కావాలి. మా జీవనం కూడా జరగదు అని అంటుంటారు.

ప్రభువు మనకు తోడుగా ఉన్నాడు. ఆయన విడువడు ఎడబాయడు. మనల్ని సత్యవంతుల ుగా తీర్చింది ఆయనే కాబట్టి తన నీతిమార్గాలలో నడిపించడానికి సమర్థుడు, నిజం మాట్లాడేటట్లు చేసేవాడు ఆయనే. ఆయన బిడ్డలంగా మనం ఉన్నది ఉన్నట్లు చెప్పాలి. నిజం పలకమన్నారు కదా అని అన్ని విషయాలు అందరికీ చెప్పకూడదు. అది బుద్ధిహీనత అవుతుంది. తెలివికలిగి ప్రవర్తించాలి. కొన్ని సంగతులు చెప్పకూడనివి అయితే అవి కాన్ఫిడెన్షియల్, నేను చెప్పను అని యథార్థంగా చెప్పాలి. అబద్ధం ఆడాల్సిన అవసరం లేదు.

ఒక్కోసారి నిజం చెప్పడానికి అవకాశం ఉండదు. అబద్ధం ఆడాల్సిన పరిస్థితులు వస్తాయి. అయితే ప్రభువు మన చెంత ఉన్నాడు, ఆయన మీద ఆధారపడి, ఆయనకు మొఱ్ఱపెడితే ప్రతి శోధన నుంచి మనల్ని తప్పిస్తాడు. అబద్ధం ఆడకుండా కాపాడి, నిజం చెప్పేటట్లు బలపరచి నిలబెడతాడు.

## కోపము

విశ్వాసులం అయినప్పటికీ కోపం మనలో చాలాసార్లు కన్పిస్తుంది. దీనికి కారణాలు మనలో కలిగిన నిరాశ, నిస్పృహ, అనుకొన్నది జరగకపోవటం, మనం చేయాల్సిన పని సరిగా చేయనప్పుడు, ఇతరులు మనకు అన్యాయం చేసినప్పుడు, మోసగించినప్పుడు కోపం వస్తుంది. కొందరికి ప్రతిదానికి కోపం వస్తుంది. క్రైస్తవ సంఘాల్లో సంఘనాయకులు అక్రమంగా ప్రవర్తించినప్పుడు కోపం వస్తుంది. కొంతమంది ప్రసంగం చేసేటప్పుడు తల, తోకలేకుండా, అంశం లేకుండా మాట్లాడుతూ, రిఫరెన్స్‌లు తిప్పి చదువుతూ సమయాన్ని వృథా చేస్తుంటారు. అప్పుడు విపరీతమైన కోపం వస్తుంది.

మరికొందరు కోపం తెచ్చుకుంటారు. మంచిపని జరగాలని, మంచిని జరిపించాలని కోపపడుతున్నట్లు చెబుతారు. ఏదిఏమైనా మానవుని కోపం దేవుని నీతిని నెరవేర్చదు. అయితే దేవుని కోపం దేవుని నీతిని నెరవేరుస్తుంది. మనుషులకు కోపం వస్తే చెడ్డమాటలతో దూషిస్తారు. చెడ్డమాటలు పలుకుట దేవునికి విరోధమైన పాపము (మత్తయి 5:22).

కోపం, ఆవేశంతో ఊగిపోతుంటే ప్రభువు దగ్గర మన పాపాన్ని ఒప్పుకుందాం. మన కోపం ద్వారా ఎంతమందికి బాధకల్గించామో ఒప్పుకుందాం. కోపం వలన ఆరోగ్యం పాడవుతుంది. మనకు, మన కుటుంబానికి నష్టం కలుగుతుంది. గనుక ప్రభువు దగ్గర ఒప్పుకొంటే ఆయన మనల్ని క్షమించి సమస్త దుర్నీతి (కోపం) నుండి మనల్ని పవిత్రపరుస్తాడు.

## ముగింపు

మనలో కొందరు ఉంటారు. వారు విశ్వాసుల్లో విశ్వాసులుగా చెలామణి అవుతూ, మారుమనస్సు పొందాం అంటూ మన సహవాసంలోకి వస్తుంటారు. వారు ఇంకా పై బలహీనతల నుండి విడుదల పొందరు, పొందలేరు. ఎందుకంటే వారికి పాపంలో కొనసాగడం ఇష్టం. అలా కొనసాగటమే వారి నిర్ణయం. సమాజంలో గుర్తింపుకోసం, అందరి మన్ననలు పొందటానికి ప్రయత్నిస్తుంటారు. అయితే వారిని వారి ఫలము వలన మనం గుర్తించవచ్చు. ప్రతి మంచి చెట్టు మంచి ఫలాల్ని ఫలిస్తుంది (మత్తయి 7:17). ప్రతి చెట్టు దాని ఫలం వలన మంచిదా చెడ్డదా అని తెలుస్తుంది. మామిడి చెట్లు అన్ని చూడటానికి ఒకే విధంగా కన్పించవచ్చు. కానీ ఏది తీయని ఫలాల్ని ఇస్తుందో, ఏది పుల్లని ఫలాల్ని ఇస్తుందో దాని ఫలం వలన మాత్రమే తెలుస్తుంది.

నీ బలహీనతల నుండి నిజంగా నీవు బయటపడాలని అనుకొంటున్నావా? వాటిలోనే కొనసాగాలనుకొంటున్నావా? బయటపడాలనుకొంటే నీ గదిలోకి వెళ్ళి తలుపు మూసుకొని ప్రభువుతో నీ బలహీనత అంతా చెప్పు. ఏదీ దాచుకోవద్దు. నీ హృదయంలోనున్న దురాలోచనలు, నిన్ను అపవిత్ర పరచే కోరికల్ని ప్రభువు దగ్గర ఒప్పుకో. విడిచిపెట్టు. ఆయనపై ఆధారపడు. గొప్ప విడుదలను అనుభవిస్తావు. అట్టి విజయం ప్రభువే నీకు అనుగ్రహిస్తాడు (1 యోహాను 1:9). కొంతమందికి వారి బలహీనతల నుండి (పాపాల నుంచి) బయటపడటానికి ఎంతమాత్రం ఇష్టపడరు. అట్టివారు ఎన్నడూ వాటి నుండి బయటపడలేరు. దేవునికి ఇష్టులుగా ఉండలేరు.

– డా. పిట్టా. సిరాజ్, ఇవాంజిలిస్ట్, విజయవాడ

కవిత




# ఉండాలి... ఉండరాదు...

ఉండాలి పరిచర్యలో పరిశుద్ధ లేఖనాలతో కట్టుబాటు
ఉండరాదు మౌళిక విలువలతో తడబాటు

ఉండాలి వీటిని వ్యక్తిగతంగా అనుసరించే అలవాటు
ఉండరాదు విషయ గ్రహింపులో తొందరపాటు

ఉండాలి అపవాది ఆలోచనలతో మనకు యెడబాటు
ఉండరాదు అపవాది ఆలోచనలపై మనకు ఏమరపాటు

ఉండాలి ప్రతివారికి అవకాశ కల్పనా వెసులబాటు
ఉండరాదు మనకు సహోదరుల సంకల్పనలపై గ్రహపాటు

ఉండాలి ప్రతి విశ్వాసి ఔన్నత్యానికి మన తోడ్పాటు
ఉండరాదు మనకు సోదర విశ్వాసి నమ్మకంపై నగుబాటు

ఉండాలి మనకు చిక్కులబెట్టు పాపంపై ఉలిక్కిపాటు
ఉండరాదు వ్యక్తిగత జీవితమందు పాపపు మిగులబాటు

ఉండాలి సహవాసమందు ఐక్యతకై చెల్లుబాటు
ఉండరాదు సహవాసమందు స్వార్థపు సర్దుబాటు

ఉండాలి నశించేవారికి సువార్తనందించే వేగిరపాటు
ఉండరాదు మన తోటివారిని విస్మరించే పొరపాటు

ఉండాలి సహవాసమందు దైవచిత్తానికి సిద్ధపాటు
ఉండరాదు సహవాసమందు అపవాదికి చొరబాటు

ఉండాలి మనం ప్రభు సేవకై అందుబాటు
ఉండరాదు సాతాను శోధనకు లొంగుబాటు

– పి. సూర్యప్రకాష్, ఎమ్మిగనూర్



# ఫాలోఅప్

## ...ఆప్షన్ కాదు

సువార్తను వినని వారికి వినిపించడం, చెప్పడం విశ్వాసుల పని.
విన్న సువార్తను విశ్వసించడం విన్నవాని పని.
విన్న సువార్తను విశ్వసింపజేయడం పరిశుద్ధాత్ముని పని.
విశ్వసించిన వానిని విశ్వాసంలో నడిపించడం, బలపరచడం విశ్వాసుల పని.
వినిపించడం - విశ్వసించడం - నడిపించడం - బలపరచడం
అనే కార్యక్రమంలో మన పని చాలా ఉంది.

2021 - 22 విద్యా సంవత్సరంలో ఉన్న అననుకూల పరిస్థితులలో కూడా మన రాష్ట్రంలో 53,889 మంది విద్యార్థులకు రక్షణ సువార్త ప్రకటిస్తే, 10,470 మంది సువార్తకు స్పందించడానికి సహాయం చేసిన దేవునికి మహిమ కలుగునుగాక! ఈ సువార్త ప్రకటించడంలో ప్రయాస పడిన విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్, స్టాఫ్ అభినందనీయులు. 795 ఫాలో అప్ మీటింగ్స్ ద్వారా కేవలం 3,976 (38%) మందిని మాత్రమే ఫాలోఅప్ చేయగలిగాం. మిలిగిన వారి పరిస్థితి ఏంటి? వారి విషయంలో దేవుడు మనల్ని లెక్క అడగడా?

వాస్తవానికి విద్యార్థులు క్యాంప్స్‌లో, గాస్పల్ మీటింగ్స్‌లో చేసే తీర్మానం ఆరంభం మాత్రమే. వీళ్ళు ఆధ్యాత్మికంగా ఎదగడం, ప్రభావితంగా క్రైస్తవ సాక్ష్యాన్ని కలిగి జీవించడం అనేది మనం వాళ్ళకి అందించే ప్రార్థనా సహకారం, వ్యక్తిగత శ్రద్ధపై ఆధారపడి ఉంటుంది. అందుకు ఫాలోఅప్ అతి ప్రాముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.


ఫాలోఅప్ అనగా నూతనంగా రక్షింప బడిన విద్యార్థులను ఆధ్యాత్మికంగా పరిపక్వతలోనికి నడిపించడం (కొలొస్స 1:28). వారిమీద ప్రత్యేకమైన శ్రద్ధను చూపిస్తూ, క్రమంగా బైబిల్ స్టడీస్‌కి హాజరయ్యేటట్లుగా (హెబ్రీ 10:24), వ్యక్తిగత వాక్య ధ్యానం (1తిమోతి 4:13), ప్రార్థన, సహవాసం, శోధనల్ని జయిస్తూ పవిత్రతను కాపాడుకొనేటట్లు (2తిమోతి 2:22) ప్రోత్సహించడమే కదా!

సాధారణంగా లోకంలో "బాల్యంలో పిల్లలకు ఎలా నడకను నేర్పిస్తామో, నడక నేర్పించడానికి ఎంత ఆసక్తి చూపుతామో.. వారు నడుస్తున్నప్పుడు ఎంత ఆనందిస్తామో అందరికీ తెలిసిన విషయమే". ఆత్మీయ జీవితంలో కూడా అంతే. కొత్తగా దేవునిని అంగీకరించిన విద్యార్థులకు, ఆత్మీయంగా బాలురుగా ఉన్న విద్యార్థులకు విశ్వాసంలో నడకను నేర్పించాల్సిన బాధ్యత మనపై ఉంది.

"పరిశుద్ధతవైపు నడిపించే వ్యక్తులకంటే, పాపం వైపు నడిపించే వ్యక్తుల మధ్యలో విశ్వసించిన వారు ఉన్నారు" గనుక వారి విషయంలో మనం మరింత శ్రద్ధ తీసుకోవాలి.

బర్నబా - పౌలును దగ్గరకు తీసిన తీరు (అ.కా. 9:27; 11:25 ), పౌలు, బర్నబాలు కలిసి నూతన

**సువార్తకు స్పందించేవారు ఎలా ఉంటారు?**




విశ్వాసులను ఆత్మీయంగా స్థిరపరిచిన విధానం (అ.కా. 15:36) మనకెంతో మాదిరి. కొత్త నిబంధనలో పౌలు వ్యక్తిగతంగా, సంఘాలకు రాసిన ఉత్తరాలే దీనికి నిదర్శనం. పౌలుకు గల ప్రేమ, నూతన విశ్వాసుల పట్ల శ్రద్ధను చూస్తే ఎంతో ప్రోత్సాహాన్నిస్తుంది. వాళ్ళను ఫాలోఅప్ చేయడంలో తన ప్రాణాన్ని సహితం ఇవ్వడానికి సిద్ధపడ్డాడు. “మీరు మాకు బహు ప్రియులైయుంటిరి గనుక మీ యందు విశేషాపేక్ష గలవారమై దేవుని సువార్తను మాత్రమే గాక మా ప్రాణాలను కూడా మీ కిచ్చుటకు సిద్ధపడియుంటిమి.” (1 థెస్స 2:7-8; గలతీ 4:19).

గాస్పెల్ మీటింగ్స్ గురించి కమిటీ మీటింగ్‌లో సూక్ష్మంగా ప్రణాళికలు వేసే సమయంలోనే, ఒక గాస్పల్ మీటింగ్‌కు కనీసం రెండు ఫాలో అప్ మీటింగ్స్ (ఎప్పుడు , ఎక్కడ, స్పీకర్ ఎవరు) గురించి కూడా ప్రణాళికలు ఖచ్చితంగా వేయాలి, వాటి కోసం క్రమంగా ప్రార్థించాలి.

గాస్పెల్ మీటింగ్ అయిన వెంటనే అక్కడే ఉన్న సీనియర్ స్టూడెంట్స్, గ్రాడ్యుయేట్స్ - నూతనంగా రెస్పాండ్ అయిన విద్యార్థులను కలుసుకొని షేక్ హ్యాండ్ ఇచ్చి నవ్వుతూ వారికి అభినందనలు చెప్పి, వారు ఎందుకు స్పందించారో తెలుసుకొని, తరువాత మన దగ్గర ఉన్న “మంచి నిర్ణయమే .... సాగిపో” అనే కరపత్రం ఇచ్చి జరగబోయే ఫాలోఅప్ మీటింగ్‌కు ఆహ్వానిస్తే ఎంత బాగుంటుంది.

నూతనంగా రక్షింపబడిన విద్యార్థుల పట్ల మనము వెంటనే స్పందించకపోతే, వ్యక్తిగత శ్రద్ధ చూపకపోతే అపవాది వారిని మరలా లోకం వైపు ఆకర్షితులై పోయే విధముగా చేస్తాడు (1 పేతురు 5:8). అది మన మనస్సును ఎంతగానో గాయపరుస్తుంది కదూ! కాబట్టి మనము వెంటనే చొరవ చూపుదాం, వారికోసం ప్రార్థిద్దాం, సమయాన్ని కేటాయించి వారిని వ్యక్తిగతంగా కలసి మాట్లాడి ఆత్మీయంగా స్థిరపరుస్తూ బైబిల్ స్టడీస్‌కి హాజరయ్యేటట్లుగా ప్రోత్సాహాన్నిఅందిద్దాం.

ఫాలోఅప్ అయిన తర్వాత కూడా ఒక్కొక్క గ్రాడ్యుయేట్ ఒకరు లేక ఇద్దరు స్టూడెంట్స్‌ని ఎడాప్ట్ చేసుకొని వారిని వ్యక్తిగతంగా కలిసి, ప్రార్థించి, తరుచుగా ఫోన్‌లో మాట్లాడుతూ వారి యోగక్షేమాలు (ఆధ్యాత్మిక, శారీరక, మానసిక) కనుక్కొంటూ విద్యార్థి దర్శనాన్ని వివరించాలి. మన ఉద్యమ స్వభావానికి వ్యక్తిగత శ్రద్ధ ఎంతో అనివార్యం. యేసుక్రీస్తు వారు కొందరిని ఏర్పరుచుకొని వ్యక్తిగతంగా సమయం గడిపేవారు. వారిని తాను నివసించే ప్రదేశాలకు ఆహ్వానించేవారు (మార్కు 3:14, యోహాను 1:39). మన పితరులు కూడా ఇదే మాదిరిని అనుసరించి వ్యక్తిగత శ్రద్ధను చూపించారు. గనుక ఇదే మాదిరి ని మనం అనుసరిద్దాం.

ఫాలోఅప్ ప్రభావితంగా చేయడానికి సామర్థ్యం, అందుబాటులో ఉండడం రెండూ అవసరమే (యెషయా 6:8; అ.పో.కా. 9:6).

**MISS** అనే స్ట్రాటజీని కూడా మనం అల వర్చుకోవచ్చు.

| | |
|---|---|
| **Multiply** | - యోహాను 12:24 |
| **Invest** | - మార్కు 3:14 |
| **Start with one** | - 1 సమూయేలు 1:27 |
| **Stay with one** | - కొలస్సీ 1:28 |

ఫాలోఅప్ అనేది సువార్త ప్రకటన తర్వాత. ఆప్షన్ కాదు కానీ అత్యవసరం.

**- ఎబినేజర్‌బాబు,** ఒంగోలు



# దైవభక్తి

భక్తి అంటే దేవుని పట్ల ప్రేమ, ఆరాధనా భావం, అంకితభావంగా భావించవచ్చు. భక్తి అనే మాటకు ఇంగ్లీష్‌లో 'గాడ్లీనెస్' అనే పదము వాడటం జరిగింది. 'డివోషన్' అనే భావాన్ని స్ఫురించే అర్థంలో కూడా వాడతారు. భక్తులు అంటే 'డివోటీస్', దేవునికి అంకితం చేసుకొన్నవారు అని అర్థం.

బైబిల్‌లో భయభక్తులు అనే పదము వాడటం జరిగింది. భయానికి భక్తి జోడించడం జరిగింది. దేవుని గూర్చిన భయం అంటే గౌరవముతో కూడిన భయం(రివరెన్షియల్ ఫియర్). ఈ భయం మనలను భక్తిగా జీవించేటట్లు చేస్తుంది. దేవునియందలి భయభక్తులు కలిగి ఉండటమంటే చెడుతనాన్ని విడిచిపెట్టడమే. భక్తి మనకు శక్తినివ్వాలి లేకపోతే మన భక్తి నిజమైనది కాదు. మనము భక్తిగలవారమో లేదో తెలుసుకోవాలంటే బైబిల్‌లో ఈ క్రింది వ్యక్తుల జీవితాలను గమనిస్తే మనకు విషయం అర్థం అవుతుంది.

### 1. యోసేపు (ఆది 42:18)

నేను దేవునికి భయపడువాడను అని సహోదరులతో చెప్పుకొన్నాడు. యెహోవాయందు భయము అతనిని పాపం చేయకుండా అడ్డగించి భక్తిగా, పవిత్రంగా ఉండేటట్లు, కష్టాల్ని సహించేటట్లు, క్షమించే మనస్సుగలవాడిగా చేసింది.

### 2. ఓబద్యా (1 రాజులు 18:3-16)

బాల్యంనుండి యెహోవాయందు భయభక్తులు గలవాడని చెప్పుకొన్నాడు. అంతేకాకుండా, ఆహాబు దేవుని ప్రవక్తలను చంపుతుంటే నూరుమంది ప్రవక్తలను గుహకు 50 మంది చొప్పున దాచి వారికి అన్నపానములు ఇచ్చి పోషించాడు. దైవభక్తిగలవారు సేవకులను కాపాడతారు, పోషిస్తారు.

### 3. దానియేలు (6:23)

దానియేలు నమ్మకస్తుడు. తప్పయినను నేరమైనను చేయనివాడు గనుక అతనిలో ఏ తప్పయినను లోపమైనను కనుగొనలేకపోయిరి. ఆయనకు కీడు చేయాలని అనేక ప్రయత్నాలు జరిగినా ఆయన భక్తిగలవాడు గనుక అతనికేమియు జరుగలేదు. దైవభక్తిగలవారిలో నమ్మకత్వం, లోపరహితం, నిర్దోషంగా ఉండడం, వారికి దేవుని కాపుదలను చూస్తాము.

### 4. సుమెయోను (లూకా 2:25)

ఆయనను గూర్చి నీతిపరుడు, భక్తిపరుడు, ఇశ్రాయేలు ఆదరణ కొరకు కనిపెట్టువాడు, ఆత్మవశుడు అని రాయబడింది. దైవభక్తి మనం నీతిగా జీవించేటట్లు, విశ్వాసులను ఆదరించేటట్లు చేస్తుంది.

### 5. కొర్నేలీ (అపొ.కా. 10వ అధ్యాయం)

ఇటలీ పటాలములో శతాధిపతి. ఆయన భక్తిపరుడు. ఆయన ఇంటివారందరితో దేవునియందు భయభక్తులు గలవాడైయుండి ప్రజలకు బహుధర్మము చేయుచూ ఎల్లప్పుడూ దేవునికి ప్రార్థన చేయుచుండువాడు. తన సైనికుడు కూడా భక్తిపరుడు అని రాయబడింది.

### 6. పౌలు, సిల్వాను, తిమోతి (1 థెస్స 2:10)

థెస్సలోనికయుల వద్ద వాళ్ళు ఎంతగానో భక్తిగా నీతిగా అనింద్యముగా జీవించారు. మేము మీ ఎదుట ఎలా జీవించామో, మీకు తెలుసు గదా అని సవాలు విసిరాడు.

ఇంకా అనేకమంది భక్తిపరులను మనము బైబిల్‌లో చూడవచ్చు. ఉదాహరణకు, నోవహు, యోబు, ఏలీయా, బాప్తీస్మమిచ్చు యోహాను, స్తెఫను, లూదియ మొదలైనవారు. వీరు దేవుని ఉనికిని, దేవుని శక్తి నమ్మి దేవునిని గౌరవించి ఆయనకు భయపడుతూ భక్తిగా జీవించారు. వారికి దేవునికి

మధ్య ఉన్న సంబంధం వారికి దేవుని గూర్చిన అనుభవజ్ఞానంగలవారై ఆయన కొరకు భక్తిగా జీవించేటట్లు చేసింది.

యోబు, కీర్తన, సామెతల గ్రంథాలు భక్తిహీనుల పరిస్థితులను గూర్చి, వారి గమ్యాన్ని గూర్చి ఎక్కువగా వివరించాయి. రోమా పత్రికలో సమస్త భక్తిహీనత మీద దేవుని ఉగ్రత కుమ్మరించబడుతుందని రాయడం జరిగింది. ఈ లోకంలో ఉన్న భ్రష్టత్వం అంటే అవినీతి అని ఇంగ్లీష్ బైబిల్‌లో తర్జుమా చేయబడింది. దైవభక్తిగా ఉండి దాని శక్తిని ఆశ్రయించనివారు ఉంటారు అని కూడా బైబిల్లో రాయబడింది.

దైవభక్తిని గూర్చి తిమోతి, యాకోబు పత్రికలు ఎక్కువగా వివరించాయి. మలాకీ దేవుని గూర్చిన భయంను వివరిస్తుంది.

భక్తిగలవాడు నోటికి కళ్ళెము పెట్టుకొంటాడు. హృదయం తనను మోసం చేసుకోకుండా చూసుకొంటాడు అని యాకోబు రాస్తూ తండ్రి యెదుట పవిత్రమైన, నిష్కళంకమైన భక్తి ఏదనగా దిక్కులేని పిల్లలను, విధవరాండ్రను వారి ఇబ్బందిలో పరామర్శించుట మరియు ఇహలోకమాలిన్యం తనకు అంటకుండా కాపాడుకోవడమే అంటాడు. ఇది ప్రత్యేకంగా జీవించడాన్ని, ప్రతిష్టించుకోవడాన్ని లేక పరిశుద్ధంగా జీవించడాన్ని తెలియచేస్తుంది.

మనము సంపూర్ణ భక్తియు మాన్యతయు కలిగి నెమ్మదిగాను సుఖముగాను బ్రతకాలంటే మనుష్యులందరి కొరకు, రాజుల కొరకు, అధికారులందరి కొరకు ప్రార్థన, విజ్ఞాపనలు, యాచనలు, కృతజ్ఞతాస్తుతులు చేయాలి, లేకపోతే వీరు మన భక్తికి ఆటంకంగా ఉంటారు (1 తిమోతి 2:1). దైవభక్తికి అనుగుణ్యమైనవి బాహ్య అలంకారాలు కాదుగానీ సత్క్రియలు (1 తిమోతి 2:10). దైవభక్తివిషయంలో సాధకం చేసుకోవాలని పౌలు తిమోతిని హెచ్చరిస్తున్నాడు (1 తిమోతి 4:7). అంతే కాకుండా దైవభక్తి ఇప్పటి జీవం విషయంలోనూ, రాబోవు జీవం విషయంలోనూ ప్రయోజనకరమైనదని పౌలు రాశాడు. దైవభక్తి వాగ్దానంతో కూడినది. అంటే దానికి ప్రతిఫలం ఉంటుంది (1తిమోతి 4:8). మనము దైవభక్తికి అనుగుణ్యమైన బోధను మాత్రమే అంగీకరించాలి (1 తిమోతి 6:3). దైవజనులు నీతిని, భక్తిని సంపాదించుకోవడానికి ప్రయాసపడమని సలహా ఇచ్చాడు. క్రీస్తునందు సద్భక్తితో బ్రతుకనుద్దేశించువారు హింసనొందుదురు అని రాయబడింది. 2 పేతురు 3:12లో రాకడ కొరకు కనిపెట్టేవారు పరిశుద్ధంగా జీవించాలని, భక్తి కలిగి జాగ్రత్తగా ఉండాలని మనలను హెచ్చరించాడు. దైవభక్తి ఇంగ్లీష్‌లో 'గాడ్లీనెస్' అని తర్జుమా చేయబడింది. దైవజనులు అనేమాట ప్రవక్తలకు, దేవుని సేవకులకు రాయబడింది. తిరిగి జన్మించిన ప్రతి వారము దైవజనమే. మనము దేవస్వభావములో పాల్గొని దేవుని స్వారూప్యములోనికి మార్చబడటం దేవుని అంతిమ ఉద్దేశం.

మన సహవాసంలో మన వ్యవహారాలు, సంబంధాలు, ఉద్దేశాలు, యధార్థంగా ఉన్నాయో లేదో మనం సరిచూసుకోవాలి. దేవుడు వేషధారులను క్షమించడు. నీతి, యధార్థత, న్యాయం, నిష్పక్షపాతం, ప్రేమ, క్రమము, నమ్మకత్వం మొదలైనవి అన్నీ కలిపితే భక్తి అని చెప్పవచ్చు.

ఇదిగో దేవా నా జీవితం, ఆపాదమస్తకం నీకంకితం అనే పాట ఎంతో భక్తి భావనను మన జీవితాల్లో పురిగొల్పుతుంది. అయితే ఎంతవరకు ఆ పాటలోని అర్థాన్ని మన జీవితానికి అన్వయించుకొన్నామో ఆలోచించుకోవాలి.

మనం ఈ లోకానికి, దాని విలువలకు, దాని ఆపేక్షలకు భిన్నంగా దేవుని వాక్యపు విలువలు కలిగి జీవిస్తున్నామా లేదా అని సరిచూసుకోవాలి. కళాశాలల్లో, ఆఫీస్ ప్రాంగణాలలో, పనిచేసే ప్రాంతాలలో మన సాక్ష్యం, మన ప్రవర్తన, మన వైఖరులు, మన విలువలు, మన భక్తిని ప్రతిఫలిస్తున్నాయో లేదో సరిచూసుకోవాలి.

యోసేపును గూర్చి ఫరో ఇతనివలె దేవుని ఆత్మగల మనుష్యుని కనుగొనగలమా అని అతని గూర్చి సాక్ష్యమియ్యడం (ఆది 41:38) బెల్షస్సరు భార్యయైన రాణి దానియేలును గూర్చి (దానియేలు 5:11) అతడు పరిశుద్ధ దేవతల ఆత్మగలవాడు. అతడు దైవజ్ఞానము వంటి జ్ఞానము, బుద్ధియు, తెలివి గలవాడు అని సాక్ష్యమియ్యడం చూస్తే మనలను గూర్చి ఇతరులు ఆ విధమైన సాక్ష్యమిచ్చేలా మన భక్తి జీవితం అందరికీ ఆదర్శవంతంగా, ఆశీర్వాదంగా ఉండునుగాక!

**– జి. జెర్మియా ప్రసాద్,** స్టాఫ్, తుని

# స్పర్థ

ఒకానొక స్పర్థ
భార్యొకవైపు భర్తొకవైపు
ఏకశరీరం వెయ్యిముక్కలుగా
విరిగిపోతున్న శబ్దం

కలలు పండించుకోవాల్సిన కాపురంలో
కలతల గింజల్ని నాటుకుంటారు
నిందల బోనులో చెరోవైపు నిలబడి
దూరాల శిక్షను విధించుకొంటారు

అహం కొమ్ముల్ని ఒళ్ళంతా మొలిపించుకొని
ఒకరినొకరు పొడుచుకుంటూ తిరుగుతుంటారు
అనుమానపు పడగలు విప్పుకొని
ఒకరినొకరు కసిగా కాటేసుకొంటారు

చర్చ్ ముగిసేదాకా
ముసుగులా కప్పుకున్న ఆధ్యాత్మికత
ఇంట్లో అడుగు పెట్టగానే ఎగిరిపోతుంది
సమాధిలోంచి పొడుచుకొచ్చిన అస్థిపంజరాల్లా
అసలు రూపాలు బయటపడతాయి


నలుగురిలో వెలిగిన నవ్వుల దీపాలు
ఇద్దరి నడుమ హఠాత్తుగా ఆరిపోతాయి
అతిథుల కచేరీలో
జంటగా ఆలపించిన యుగళగీతాలు
ఒంటరివేళ వెకిలిస్వరాలై వెక్కిరిస్తాయి

అందరిమీదా అభినందనలు కుమ్మరించే అతడు
ఆమెపై మాత్రం కోపాల కత్తులు నూరుతుంటాడు
అందరిమీదా ఆప్యాయతను కురిపించే ఆమె
అతడిలో మాత్రం లోపాల గని తవ్వుతుంటుంది


ఇద్దరూ పోటీపడి
ఇంట్లో ఒలికించిన చేదునీరు
పిల్లల వేర్లకు చేరుతుంటుంది
తప్పెవరిదో తేల్చుకొనేలోపు
కారుద్రాక్షలు పెరట్లో వేలాడుతుంటాయి

పంతాల బూజులు దులిపేసి
ఇల్లంతా ప్రేమ తోరణాలు కట్టేసి
తలుపు బయట నిలుచున్న ప్రభువును
ఇప్పుడైనా లోపలికి పిలవలేరా
ప్రభువు వాక్య ప్రమిదల్ని
ప్రతిమూలా వెలిగించుకొని
ప్రణయ కాంతుల మధ్య ఇద్దరూ కలవలేరా?

– డా. ప్రసాద్ తాళ్ళూరి



కథానిక



# అపవిత్రత నుండి పవిత్రతలోకి...

"ఛీ..ఛీ.. ఇవేం బొమ్మలు. సగం బట్టల్తో ఉన్న మనుషులు గోడెక్కి నుంచున్నట్లుగా ఉన్నాయి" అనుకొంటూ ముందుకు నడిచాడు నానీ. డిగ్రీ చదివే నానీకి ఆ రోడ్డు చిరపరిచితమే. ప్రతీరోజూ ఆ రోడ్డునుంచే నడుచుకొంటూ కాలేజీకి వెళ్తాడు. రకరకాల మనుషుల్ని చూడడం అలవాటే అయినా, అర్ధనగ్న బొమ్మలతో ఉన్న వాల్‌పోస్టర్లను కూడా చూస్తూ నడవాల్సి రావడం నానీకి కొంచెం ఇబ్బందిగా అనిపిస్తుంటుంది.

దేవుణ్ణి తెలుసుకొని రక్షణపొందిన తొలిరోజుల్లో అసలు కంటిచూపు అటువైపు వెళ్ళకుండా నడిచేవాడు. బైబిల్ స్టడీకి వచ్చే మిగతా పిల్లలతో కలిసి ఎప్పుడూ ఏదో ఒక బైబిల్ స్టడీలోనో, రిట్రీట్ లోనో, క్యాంప్‌లోనో పాల్గొంటూ ఉండేవాడు. తరగతిలో క్లాస్ వినడం, రూముకొస్తే ఎవరో ఒక అన్నను కలవడం, సందేహాలుంటే తీర్చుకోవడం మొదలైన పనులతో కాలం తెలియకుండా గడిచిపోయేది.

రోజులు గడిచేకొద్దీ బైబిల్‌స్టడీమీద ఎందుకనో ఆసక్తి తగ్గింది. నడవాలని నిర్ణయించుకున్న దారికీ, నడుస్తున్న దారికీ పొంతన లేదు. మనసు నిలకడగా ఉండట్లేదు. ఏవేవో చేయాలని దేహం ఉవ్విళ్ళూరుతోంది. భక్తి బైబిల్ మీద ఉంచుతున్నాడు గానీ అదుపు తప్పుతున్న మనసును ఆధీనంలోని తెచ్చుకోలేకపోతున్నాడు. వాక్యధ్యానంలో కూర్చున్నప్పుడల్లా ఏదో తప్పు చేస్తున్నానన్న భావన పట్టి పీడిస్తోంది. లోకాన్ని చూడకుండా కళ్ళు మూసుకోవాలంటే తెలియని బాధ వేధిస్తోంది.

జీవితం సంఘర్షణతో కూడుకొన్నదనీ, మంచికీ చెడుకీ మధ్య నిరంతర పోరాటాన్ని రగుల్చుతూనే ఉంటుందనీ నానీకి అనుభవంలోకి వచ్చింది. వయసుతో పాటు శరీరంలో కలిగే మార్పులు, అప్పుడప్పుడూ పిల్లగాలిలా గిలిగింతలు పెట్టే ఏవో తెలియని కోరికలు అతడి మనసును అటూఇటూ కాని డోలాయమానంలోకి నెడుతుండడం తెలుస్తూనే ఉంది. అయినా.. ఏం చేయగలడు తను?

లోకమంతా ఏదో పనున్నట్టు, ఏదో కోల్పోతున్నట్లు చెడుని చూడడానికి, చెడుని చూపించడానికి, చెడ్డపనులు చేయడానికి పరిగెత్తడం చూస్తుంటే నాని మనసు కూడా అనుకోకుండా అప్పుడప్పుడు దారి తప్పుతూనే ఉంది.

ఏది మంచి? ఏది చెడు? వాక్యానికి విధేయంగా నడవడం మంచి, అవిధేయత చూపించడం చెడు! 'దేవుని యందు భయభక్తులు కలిగివుండడమంటే చెడును అసహ్యించుకోవడమే' కదా! ఇంతకీ తను చెడును ప్రేమిస్తున్నాడా? ద్వేషిస్తున్నాడా? దేవుని పోలి నడుచుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాడా? తన ఇష్టాన్ని నెరవేర్చుకోవడానికి తపన పడుతున్నాడా? సజీవుడైన దేవుణ్ణి అనుసరించడం మాని అశాశ్వతమైన లోకాన్ని, వ్యక్తుల్ని అనుకరించడానికి ఆరాటపడుతున్నాడా? ఎంతకీ తెగని ఆలోచనలతోనే క్లాస్‌లోకి ప్రవేశించాడు.

***

"ఏరా.. ఇంత ఆలస్యమైంది" పలకరించాడు రవి. బదులుగా నవ్వి ఊరుకున్నాడు తప్ప సమాధానం చెప్పలేదు. "సరేగానీ,ఇవ్వాళ సాయంత్రం రామూగాడి పుట్టినరోజట. సాయంత్రం పార్టీకి రమ్మంటున్నాడు" అన్నాడు రవి. అతని వంక నిర్లిప్తంగా చూస్తూ "నేనెందుకులేరా! మీరు వెళ్ళిరండి" అన్నాడు నాని."అసలు నిన్నడగడం నా బుద్ధి తక్కువ. నువ్వెప్పుడూ ఇంతేగా! ఏదో లోకంలో ఉంటావు. సినిమాకి రమ్మంటే రావు, షికారుకి వెళ్దామంటే కదలవు" అన్నాడు చిరుకోపంగా.

రవి వంక చూసి నవ్వుతూ "మొదటి నుంచీ అంతే కదరా. మళ్ళీ కొత్తగా అడుగుతావెందుకు" అన్నాడు నాని. "అదే నేను కూడా చెప్తున్నాను. నిన్ను రమ్మన్నాము గానీ మేము చేసేవన్ని నిన్ను చేయమనలేదుగా! చూస్తూ ఉండమంటున్నాము. దానికి కూడా బాధేనా" అన్నాడు రవి.

నానీలో ఆలోచన మొదలయింది. ఇంతకుముందు కూడా ఫ్రెండ్స్‌తో కలిసి పార్టీలకు వెళ్లాడు. వాళ్ళతోనే ఉన్నాడు కానీ వాళ్ళు చేసే పనుల్లో భాగస్వామి కాలేదు. మనసు ఎంత లాగుతున్నా ఏ మూలో ఉన్న దేవుని భయం నానీని అడుగు ముందుకు వేయనివ్వలేదు. అందమైన అనుభవాల్ని మిగిల్చినంతసేపూ జీవితమెప్పుడూ విలువైందిగానే కనిపిస్తుంది. అనుకోనివో, నచ్చనివో జరిగినప్పుడు మాత్రమే మన పరిస్థితి మనకు అర్థమవుతుంది. ఆలోచనలలోనుండి బయటపడి 'వస్తా'నన్నట్లుగా తలూపాడు నానీ.

***

పార్టీ మొదలయింది. ఒక పక్కగా నిల్చున్నాడు నానీ. క్లాస్మేట్స్ హడావిడిగా కనిపించారు. ఒకరిద్దరు అమ్మాయిలతో మాట్లాడుతూ అబ్బాయిలు కనిపించారు.

"ఏరా ఒక్కడివే కూర్చున్నావు? అక్కడ మన ఫ్రెండ్స్ ఉన్నారుగా. వాళ్లతో మాట్లాడు" అన్నాడు రవి.

"ఎక్కడుంటే ఏమయిందిలేరా? ఇక్కడ బాగానే ఉంది" అన్నాడు నానీ.

"పార్టీకి వచ్చి అంటీ ముట్టనట్లుగా ఉండకూడదు. నలుగురితో పరిచయం పెంచుకోవాలి. నాలుగు కొత్త అలవాట్లు నేర్చుకోవాలి. అంతేగానీ ఏదో పోగొట్టుకున్నట్లు దేవుడా అన్నట్లు నుంచుంటే ఎట్లా" అన్నాడు రవి.

"అందరూ అక్కడుంటే మీరిద్దరూ ఇక్కడేం చేస్తున్నారు? సిగరెట్ కాల్చడం ఎలాగో తెలుసుకోవాలి. సీతాకోకచిలుకల్ని ఎలా పట్టుకోవాలో నేర్చుకోవాలి గానీ ముసలోళ్ళలాగా మూలన ఉంటే ఎలా? మాటలు కలపండి. ముగ్గులోకి దించండి" అన్నాడు కిరణ్.

'ఛ.. ఛ... ఇవేం మాటలు! లోపలింత చెత్త పెట్టుకుని పైకి డిగ్నిఫైడ్'గా ఎలా కనిపిస్తున్నారు వీళ్ళు' అనుకొన్నాడు నానీ. బుద్ధి తక్కువై వచ్చినట్లుగా అనిపించింది ఒక్క క్షణం. మునిగి



పోతామని తెలిసినా నీళ్ళల్లోకి, కాలిపోతామని తెలిసినా నిప్పుల్లోకి వెళ్లడమంటే ఇదేనేమో!

అలవాట్లు మొదట్లో సాలెగూడులా బాగానే ఉంటాయి. అవి సంకెళ్ళుగా బిగుసుకొంటేనే జీవితం ప్రమాదంలో పడుతుంది. అది తెలుసుకోకుండా లోకం వెంటపడినా, అలవాట్లలో మునిగితేలినా ప్రమాదమే!

చుట్టూ చూసి పైకి లేచాడు నానీ. ఒక్కసారిగా ఇంట్లో వాళ్ళు గుర్తొచ్చారు. ఎన్నో కష్టాలు పడుతూ వచ్చిన కూలి డబ్బుల్ని దాచి తన అవసరాలకు పంపించే తల్లిదండ్రులు కళ్లముందు మెదిలారు. వాళ్ళ కష్టాన్ని ఆహారంగా స్వీకరిస్తూ తాను జీవిస్తున్నాడు. ఇంటిని విడిచిపెట్టి తను ఎందుకొచ్చాడు? కష్టపడి చదువుకోడానికి? కొత్త అలవాట్లు నేర్చుకొని పాడైపోడానికా? మనసు నిండా ఏవో ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి.

పార్టీనుంచి బయటికి నడిచాడు. లోకాన్ని మాయ కమ్మేసింది. మంచేదో చెడేదో గుర్తించలేని గుడ్డివాళ్ళుగా మనుషుల్ని మార్చేసింది. ఎక్కడ చూసినా అపవిత్రతే! నడిచే దారుల నిండా, వీధి గోడల నిండా, నోటి మాటల నిండా, చేసే పనుల నిండా, బుర్రలోని ఆలోచనల నిండా... ఒకటా రెండా కోటానుకోట్ల అపవిత్ర ఆలోచనలు!


'ఇప్పుడు నేను నా ఒంటికీ, మనసుకీ అంటిన బురదను కడుక్కోవాలా? లేక వీధిలోని అపవిత్ర బురదను కూడా కొత్తగా నా ఒంటికి పూసుకోవాలా?'అని ఆలోచిస్తూ ఇంట్లోకి అడుగుపెట్టిన నానీకి ఎదురుగా క్యాలెండర్లోని వాక్యం కనిపించింది.

"మనము పోకిరి చేష్టలు, దురాశలు, మద్యపానము, అల్లరితో కూడిన ఆటపాటలు, త్రాగుబోతుల విందులు మొదలైన వాటియందు నడుచుకొనుచు అన్యజనుల ఇష్టము నెరవేర్చడానికి గతించిన కాలమే చాలును. అపరిమితమైన ఆ దుర్వ్యాపారమందు తమతో కూడా మీరు పరిగెత్తక పోయినందుకు వారు ఆశ్చర్యపడుచు మిమ్మును దూషించుచున్నారు" (1 పేతురు 4:3,4)

తన జీవితాన్ని బట్టి దేవునిని క్షమించమని అడిగాడు. బుద్ధిగా కష్టపడి చదువుకోవాలని నిర్ణయించుకొన్నాడు. తన జీవితాన్ని బట్టి దేవునికి, తల్లిదండ్రులకు అవమానం తీసుకురాకూడదని తీర్మానించుకొన్నాడు.

***

పై చదువులు పూర్తిచేసుకొని మంచి ఉద్యోగంలో స్థిరపడ్డాడు. దేవునిలో దినదినం ఎదుగుతున్నాడు. పవిత్ర జీవితాన్ని జీవిస్తున్నాడు. తల్లిదండ్రులు, తన ఊరిలోనివారు తనంటే ఎంతో సంతోషిస్తున్నారు. దేవుని చిత్తానుసారంగా వివాహం చేసుకొని విద్యార్థుల పరిచర్యలో, సంఘంలో చురుకైన పాత్రను పోషిస్తున్నాడు.



ఒకరోజు అనుకోకుండా తన డిగ్రీ స్నేహితుడైన రవిని కలుసుకొన్నాడు. ఎంతో సంతోషమేసింది. రవి పూర్తిగా తాగుడుకు అలవాటై, కుటుంబంలో ఎన్నో సమస్యలతో ఉన్నాడని తెలుసుకొన్నాడు. తన చదువుకు సరైన ఉద్యోగంలేక ప్రస్తుతం పెయింట్ పనికి వెళ్తున్నాడని తెలుసుకొన్నాడు. పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవు. చదువుకొనేటప్పుడు పార్టీలు, షికార్లంటూ జీవితమంటే అదే అన్నట్లు ఎంజాయ్ చేశాడు. దేవుని గూర్చి చెబితే విసుక్కొనేవాడు. ఇప్పుడు ఫలితాన్ని అనుభవిస్తున్నాడు. నాని రవి కొరకు ప్రార్థన చేసి, దేవునిని నమ్ముకోమని చెప్పి కొంత ఆర్థికంగా సహాయం చేశాడు. రవి వెళ్ళిన తర్వాత నాని హృదయం దేవుడు తన జీవితంలో చేసిన మేళ్ళను తలంచుకొని కృతజ్ఞతతో నిండిపోయింది. అప్రయత్నంగా కళ్ళల్లోంచి నీళ్ళు వచ్చాయి.

**– డా. జడా. సుబ్బారావు,** నూజివీడు

# నా రాకడ కొరకు ఆత్మలను సిద్ధం చేస్తున్నావా?

సర్వసృష్టికర్తయైన దేవుడు, నోటి మాటతో సర్వాన్ని సృజించాడు. ఇదిగో నేను త్వరగా వచ్చుచున్నాను (ప్రకటన 22:7) నా కొరకు నశించి పోతున్న ఆత్మలను సిద్ధం చేస్తున్నావా? అని దేవుడు నన్ను అడిగినప్పుడు నాకు చాలా ఆశ్చర్యమేసింది! ఎందుకంటే సర్వాధికారియైన దేవుడు ఆయన తలచుకొంటే మన మెడపట్టుకొని ఆయన సువార్తను ప్రకటించు అని చెప్పగలిగే శక్తిమంతుడు. కానీ అలా చేయకుండా "నేను ఎవని పంపెదను, నా నిమిత్తం ఎవరు నశించిపోతున్న వారికి సువార్తను చెబుతారు" అని మానవున్ని అడుగుతున్నాడు. ఆయన ఆజ్ఞఇస్తే సృష్టిలోని సమస్తం ఆయన చెప్పినట్టు అవి చేస్తాయి (యోబు 37:13). మనమే ఆయన మాటను వినడం లేదు. మీరు సర్వలోకానికి వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి (మార్కు 16:15) అనే ఆజ్ఞను మరచిపోతున్నాము. నా కుటుంబం, నా ఆస్తి, నా ఉద్యోగం, నా పిల్లలు, నా అవసరాలు, పనులు అంటూ ఇహలోక విషయాల్లో మునిగిపోయి దేవుని పనిని చేయడంలేదు. అందుకే పౌలుగారు ఫిలిప్పీయులకు చెబుతూ "అందరూ తమ సొంతకార్యములనే చూచుకొనుచున్నారు గానీ యేసుక్రీస్తు కార్యములను చూడరు (ఫిలిప్పీ 2:21).

యుఇయస్ఐ పూర్వీకులు, పెద్దలు కూడా వాళ్ళ సొంత కార్యాలు చూసుకొని ఉంటే మనం ఏ స్థానంలో ఉండేవాళ్ళమో ఆలోచించుకొందాం. కాబట్టి ఇప్పుడైనా మేల్కొందాం. మన సొంత కార్యములతో పాటు దేవుని కార్యాలు చేద్దాం. నశించిపోతున్న విద్యార్థులు, ప్రజలు ఎందరో ఉన్నారు కానీ క్రీస్తు సువార్తను ప్రకటించేవారు చాలా తక్కువగా ఉన్నారు. అందుకే ప్రభువు అంటారు "కోత విస్తారమేగానీ పనివారు కొద్దిగా ఉన్నారు" (మత్తయి 9:37). ఆయన రాకడకూడా సమీపంగాఉంది గనుక త్వరగా మేల్కొందాం. నశించిపోతున్న విద్యార్థులను ప్రభువువైపు తిప్పుద్దాం.

**– కత్తి ఎర్రిస్వామి,** రైల్వే కోడూరు ఇజియఫ్
యస్‌యంటిసి డెలిగేట్ 2022

## Crossword Puzzle

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1 | | | | 2 | | 3 |
| ■ | ■ | 4 | ■ | | ■ | |
| 5 | 6 | | | | 7 | |
| 8 | | | | | | |
| ■ | | | 9 | | | |
| 10 | | | | | | |
| ■ | ■ | ■ | ■ | ■ | ■ | |

**Horizontal**
1. The Man who lived again
5. Son of Zerah
8. The man who was praised
9. The companion of Joshua
10. The Man of two natures

**Vertical**
2. The man who vowed to be separate
3. The man who was full yet failed
4. Son of Azor, Father of Achim
6. One of David's heroes from the brooks of Gaash
7. Second son of Judah by the daughter of Shua




*Please find out the hidden words in the puzzle using the clues/hints and send to Nambur office within 15 days.*

**Last month key:**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| G | E | H | A | Z | I | F | ■ |
| ■ | N | E | D | O | M | E | ■ |
| ■ | O | P | H | A | L | L | U |
| R | A | H | A | M | A | I | L |
| ■ | H | E | ■ | ■ | H | X | A |
| J | E | R | O | B | O | A | M |

*1. M. Ankarao, Guntur*
*2. T. Anand Babu & Koteswari, Chilakaluripet*
*3. R. Suma Srinivas, Tirupati*
*4. T. Anna Mani, Gudiwada*
*5. B. Rupla & Malleswari, Nandigama.*

# ఆనంద క్రైస్తవ జీవిత రహస్యం

నేను యేసుక్రీస్తును నా ప్రభువుగాను రక్షకునిగాను స్వీకరించినపుడు గొప్ప శాంతిని పొందాను. ఆ శాంతి నన్నెప్పుడూ విడిచిపోలేదు. నాలో ఏమంచీ లేదన్న విషయం నాకు తెలుసు. నా అంతరంగంలోనికి నేను చూసుకొనే కొద్దీ నాలో పాపమూ, అపజయమే నాకు కనబడతాయి. నన్ను నేను చూసుకొని నిరాశపడకుండా అనుక్షణం యేసుక్రీస్తు వైపు చూస్తూ ముందుకు సాగడం నేను నేర్చుకొన్నాను.

దేవుడు నాలో తన పరిశుద్ధాత్మను ఉంచాడు. ఆ పరిశుద్ధాత్మే ప్రతీ పాపాన్నీ, అపజయాన్నీ అధిగమించడానికి శక్తిని ఇస్తున్నాడు. నేను మాత్రం ఎప్పుడూ ఆయన వైపు చూస్తూ ఉండాల్సిందే. ఎప్పుడైతే నా దృష్టి ఆయన మీద నుండి మరలు తుందో వెంటనే పాపం, అపజయం తాలూకు ఛాయలు నాలో కనబడతాయి. అనుక్షణం దేవుని శక్తి మీద ఆధారపడుతూ జీవించడమే ఆనందకరమైన క్రైస్తవ జీవిత రహస్యం.

మనం మన పాపాల్ని ఒప్పుకొని, విడిచిపెడుతూ ఉన్నప్పుడు మన రక్షకుని రక్తం మనల్ని కడిగి పవిత్ర పరుస్తుంది. అందుకు దేవునికి స్తుతులు. అప్పుడప్పుడు నేను చేసే తప్పిదాలూ, నాకెదురయ్యే అపజయాలను బట్టి కూడా నేను దేవున్ని స్తుతిస్తాను. ఎందుకంటే అవి నన్ను దేవుని ఎదుట వినమ్రంగా ఉంచుతాయి. ఎప్పుడూ పడిపోవడానికి వీల లేనంత ఆధ్యాత్మిక ఉన్నతస్థాయికి క్రైస్తవ జీవితంలో మనం ఎప్పటికీ చేరుకోలేమని నా అభిప్రాయం. మనం శరీర ఆశల్ని నెరవేర్చకుండా ఉండాలంటే, నిరంతరం ఆయన ఆత్మ ఆధీనంలో ఉండాలి. క్రీస్తు నంగీకరించిన క్రైస్తవులందరూ తమ జీవితాలలో పరిశుద్ధాత్మ శక్తిని పొందాలని నా కోరిక. అప్పుడే వారు క్రీస్తు కోసం ధైర్యంగా జీవించగల్గుతారు. అలాంటి క్రైస్తవులు చేసిన పని చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఎందుకంటే దేవుడే ఆ పనిని ప్రారంభించి, దానిని కొనసాగించి, ముగిస్తాడు.

కొన్నిసార్లు అలాంటివారు కూడా దేవుని నుంచి దూరమైపోయే అవకాశం ఉంది. కానీ వారి హృదయాల్లో పరిశుద్ధాత్మ ద్వారా దేవుడు కుమ్మరించిన ప్రేమను సందేహించలేరని, దేవునికి వ్యతిరేకంగా తిరుగుబాటు చెయ్యలేరని నా అభిప్రాయం.



నా జీవితంలో ఎదురైన అనేక అపజయాలలో ఒకటి మీకు చెప్తాను. కొన్ని సంవత్సరాలు దేవుని ఆత్మ ద్వారా నడిచిన తర్వాత ఆయన నడిపింపును గూర్చి సందేహపడ్డాను. ఒక విశ్వాసి తన ఆధ్యాత్మిక జీవితంలో దేవునికి దగ్గరయ్యే కొద్దీ, లోకంలో ఎక్కువ ఒంటరితనాన్ని అనుభవిస్తాడు. సాతాను మాత్రం అలాంటి వారిని వదిలిపెట్టకుండా శోధిస్తూనే ఉంటాడు. వాళ్ళ నిర్ణయాలు వాళ్ళే తీసుకోవాల్సిన పరిస్థితి. ఆ సమయంలో తన ఆధ్యాత్మిక స్నేహితులు కూడా తనకు అనుకున్నంత సహాయం చెయ్యలేకపోవచ్చు. కొన్నిసార్లు "ఒక భయంకరమైన అంధకారం" చుట్టుముట్టినట్లు ఉంటుంది. సాతాను అతడిని ఇరుకున పెట్టి ఏమీ నిర్ణయించుకోలేని స్థితిలో పడేస్తాడు. "మరణాంధకార లోయలో" ఉన్నట్లు అన్పిస్తుంది. నేను కూడా అలాంటి పరిస్థితిని అనుభవించాను. ఆ సమయంలో దేవునికి నాకు మధ్య ఒక మేఘం అడ్డుగా ఉన్నట్లు అన్పించింది. కానీ ఇలాంటి పరిస్థితుల్లో ఒక విశ్వాసి, మారుమనస్సు పొందిన సమయంలో తను అనుభవించిన దేవుని ప్రేమనూ, ఆయన మంచితనాన్నీ నమ్ముతూ, ఆయన వాగ్దానాల మీద ఆధారపడి దేవునికి తనను తాను అప్పగించుకోవాలి.

ఆయన మార్గాలన్నిటినీ మనం అర్థం చేసుకోలేము గాని ఆయన ప్రేమను, దయను మనం నమ్మవచ్చు. యోబు జీవితంలో అనుమతించినట్లే దేవుడు తన పిల్లల జీవితంలో కొన్ని పరిస్థితులను అనుమతిస్తాడు. కానీ మనం ఆయన సంరక్షణకూ ప్రేమగల ఆయన చిత్తానికి మనల్ని మనం అప్పగించుకొన్నప్పుడు దేవుడు మనల్ని ఒక ఉన్నత స్థితికి తీసుకువెళ్తాడు. అక్కడ అంతా దేవుడే నిండి ఉంటాడు. ఇక సొంత ఇష్టానికి తావుండదు. మన మార్గాలకంటే ఆయన మార్గాలు, మన ఆలోచనలకంటే ఆయన ఆలోచనలు చాలా ఉన్నతమైనవి. "యెహోవాను నమ్ముకొనువాడు ధన్యుడు. యెహోవా వానికి ఆశ్రయముగా ఉండును" (యిర్మీయా 17:7).

సేకరణ: ప్రొ.ఇనాక్ గారి ఆయన అడుగుల్లో పుస్తకంనుండి



# సమస్యలకు

## నిజమైన పరిష్కారం ఉందా???

మానవ జీవితం అనేక సమస్యలతో కూడినది. ముఖ్యంగా యౌవనస్తులు తమ జీవితంలో అంతర్గతంగా అనేక సంఘర్షణలకులోనై శాంతి, సమాధానాన్ని కోల్పోతున్నారు. బయటకు నవ్వుతున్నా హృదయంలో చింత, వేదన నిరంతరం వారిని వేధిస్తున్నాయి. వీటికి కారణం ఏమిటి?

### ఒంటరితనం

ఇంటిలో అందరూ కలసే ఉంటారు కానీ మనసు విప్పి సమస్యలను ఒకరితోనొకరు పంచుకోలేరు. చులకనైపోతామనే భయంతో మిత్రులతో కూడా కొన్నింటిని పంచుకోలేరు. ఈ ఒంటరితనం నుంచి బయటపడడానికి ఫ్రెండ్స్, సినిమాలు, షికార్లు, సెల్ఫోన్‌లతో కాలక్షేపం చేస్తూ ఉంటారు. దీనికి కారణం మానవ జీవితంలోని పాపం. ఒంటరితనం పాప ఫలితమే. దీని ఫలితం హృదయంలోని శూన్యత. ఈ శూన్యత దేవుడు హృదయంలోనికి వస్తేనే, దేవునితో వ్యక్తిగత సంబంధము కలిగి ఉంటేనే అది పూరించబడుతుంది. లోకంలోని భౌతిక సంబంధమైన మరిదేనివలన ఈ శూన్యత తొలగిపోదు.

### నిజమైన శాంతి లేకపోవడం

ఒక గొప్ప వ్యక్తి, “ఈ యువతరం యొక్క ఒక గుర్తు శాంతిలేకపోవడం” అని అన్నాడు. ఒక డాక్టర్ తన దగ్గరకు వచ్చే రోగులపై సర్వే చేశాడు. దాని ప్రకారం 87% రోగులు మానసికంగాను, శారీరకంగాను, ఆత్మలోను శాంతి కావాలని కోరారు.

ప్రపంచ కుబేరుడు బిల్‌గేట్స్ ఒక ప్రశ్నకు సమాధానంగా... “నాకు కావాల్సిందాన్ని నేను పొందుకోలేక పోతున్నాను, అక్కరలేనిదాన్ని పొందుకొంటున్నాను. నాకు డబ్బు అక్కరలేదు, నిజమైన శాంతి కావాలి” అని అన్నాడు.

జీవితానికి ఉద్దేశం లేకపోవడం, భావోద్వేగాలకు సంబంధించిన సమస్యలు, అదుపులేని లైంగిక వాంఛలు, అపవిత్ర ఆలోచనలు, నన్నెవరు ఈలోకంలో ప్రేమించడంలేదనే భావాలు వారిని కృంగదీస్తున్నాయి. ముఖ్యంగా మరణమంటే భయం. ఒక రోజు చనిపోతాననే భావన వచ్చినప్పుడెల్ల



భయంతో కృంగిపోతున్నారు. మనకు ఇష్టం ఉన్నా లేకున్నా ఒకరోజు చనిపోవడం ఖచ్చితం. చనిపోయిన తర్వాత ఏమౌతుంది?

గొప్ప జ్ఞానియైన సొలొమోను "మరణం ప్రతి ఒక్కరి గమ్యం, మనిషి దాని గురించి ఆలోచించాలని" అన్నాడు.

ఈ సమస్యలకు కారణం మానవ జీవితంలోని పాపం. మానవ నైజం పాప భూయిష్టం. ఈ స్వభావంనుంచే అపవిత్ర ఆలోచనలు, స్వార్థపు ఆలోచనలు, పాపపు ఊహలు, అబద్ధాలు, గర్వం, జారత్వం, వ్యభిచారం, మోసం, ద్వేషం, అసూయ వస్తున్నాయి. పాపం ఎందరినో శాంతి లేకుండా హృదయాన్ని అస్తవ్యస్తంగా చేస్తుంది. దీని వలన మన జీవితంలో అపరాధభావం ఏర్పడి సంతోషం లేకుండా చేస్తుంది.

### దీనికి పరిష్కారమేంటి?

అశాంతికి కారణమైన పాపంనుండి ఏ మానవుడు తనంతట తాను బయటపడలేని స్థితిలో ఉన్నప్పుడు, ప్రేమగల దేవుడు తన కుమారుడైన యేసుక్రీస్తును ఈలోకంలోకి పంపాడు. ఆయన ఈ పాపాలన్నింటిని తనపై వేసుకొని 2000 సం॥ క్రితం సిలువలో చనిపోయాడు.

మనము పాపముల విషయమై చనిపోయి, నీతి విషయమై జీవించునట్లు, ఆయన తానే తన శరీరమందు మన పాపములను మ్రానుమీద మోసికొనెను. ఆయన పొందిన గాయములచేత మీరు స్వస్థత నొందితిరి (1 పేతురు 2:24) అని బైబిల్ చెబుతుంది.

ఆదియు, అంతమునైన దేవుడు ఇలా చనిపోవడం వల్లనే, ఆదినుండి అంతమువరకు ఉన్న ప్రతీ వ్యక్తి పాపాలను క్షమించడానికి, ప్రతి ఒక్కరు కోరుకునే శాంతినివ్వడానికి ఆయన మాత్రమే సమర్థుడు. ఆయన నీ కోసం సిద్ధపరచిన క్షమాపణను, శాంతిని నీవు ఆయనపై చూపే చిన్న విశ్వాసం వలన పొందవచ్చునని దేవుని వాక్యమైన బైబిల్లో వాగ్దానం చేశాడు.

మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల, ఆయన నమ్మదగినవాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతినుండి మనలను పవిత్రులనుగా చేయును. (1 యోహాను 1:9)

యేసు ప్రభువు కుల, మత, లింగ, వర్ణ బేధం లేకుండా ఎటువంటి వ్యక్తినైనా ప్రేమిస్తాడు. ఎలాంటి పాపాన్నైనా క్షమిస్తాడు. ఆయన ప్రేమగల దేవుడు, కలువరిలో చనిపోవడం ద్వారా తన ప్రేమను ప్రదర్శించాడు. ప్రభువైన యేసుక్రీస్తు మరణం, అద్భుతమైన, అనంతమైన, ఊహించలేని దేవుని ప్రేమను మనకు తెలియజేస్తుంది. నీ మనస్సులో విశ్వాసంతో చిన్న ప్రార్థన చేస్తే, నీ పాపములు క్షమించబడి నూతన స్వభావం, నూతన దృక్పథం, నూతన జీవము, పరలోక ప్రాప్తి నీకు కలు గుతాయి. ఈ దినమే యేసు ప్రభువు నందు విశ్వాసముంచి పాపక్షమాపణ మరియు శాంతి పొందుము.

నీ సమస్యలన్నిటికీ జవాబు యేసే. దేవుడు మిమ్మల్ని దీవించును గాక!

**– యం.యన్. రవికుమార్,** నెల్లూరు

**కోశాధికారి లేఖ**

# సేవ - దేవునికా? ధనానికా?

క్రీస్తునందు అతి ప్రియమైన యుఇయస్ఐ-ఏపి కుటుంబ సభ్యులకు, కోశాధికారులకు, ప్రార్థనా సహకారులకు మన ప్రభువైన యేసుక్రీస్తు నామములో వందనాలు.

"ఏ సేవకుడును ఇద్దరు యజమానులను సేవింపలేడు; వాడు ఒకని ద్వేషించి ఒకని ప్రేమించును, లేక ఒకని అనుసరించి ఒకని తృణీకరించును; మీరు దేవునిని సిరిని సేవింపలేరని చెప్పెను" (లూకా16:13). బైబిల్లోని ధనం, సంపాదనలకు సంబంధించిన వచనాలు 2000కు పైగా ఉన్నాయి. యేసుప్రభువు వారు చెప్పిన 38 ఉపమానాలలో 16 ఉపమానాలు ఈ లోకసంబంధమైన డబ్బు, సంపాదన విషయంలో ఎలా వ్యవహరించాలో తెలిపేవే. దీనిని బట్టి చూస్తే ఈ సంగతులు దేవుని దృష్టిలో ఎంత ముఖ్యమైనవో అర్థమవుతుంది. లెక్క అనే అర్థంగల 'మోనే' అనే హెబ్రీ మాట నుంచి మనీ వచ్చింది. బైబిల్లో దురాశ, ధనాశ, అన్యాయపు సిరికి 'మేమన్' అనే పదం వాడారు. వస్తువుల పట్ల విపరీతమైన మోజు, ధనవ్యామోహం మొదలైన వాటిని గురించి ఈ మాట వాడబడింది (మత్తయి6:24). యేసు ప్రభువువారు చెప్పిన పై వచనంలో నాలుగు కీలక విషయాలు గమనించగలం.

మొదటిది, ధనాన్ని దేవునితో సరిపోల్చడం, రెండవది, విశ్వాసి దేవుని స్థానంలో ధనానికి స్థానం ఇచ్చే అవకాశం ఉండటం, మూడవది, దేవునిని, ధనాన్ని సమానంగా ప్రేమింపలేము, సేవించలేము, నాల్గవది, దేవునిని ప్రేమిస్తే ధనానికి అవకాశంలేదు, ధనాన్ని ప్రేమిస్తే దేవునికి అవకాశంలేదు, ఇవి పరస్పర భిన్నమైనవి. కావున ధనంపట్ల విశ్వాసి ఎలా ఉండాలి అన్న విషయాన్ని సెల్విన్ హ్యూజ్ అనే భక్తుడు చాలా చక్కగా చెప్పాడు "ఇది గుర్తుపెట్టుకోండి – నీవు దేవునిని, ధనాన్ని ఏక కాలంలో సేవించలేవు కానీ ధనాన్ని ఉపయోగించి దేవునిని సేవించవచ్చు". కావున మనం సేవించేది దేవుడినా? ధనాన్నా? స్వపరిశీలన చేసుకొని దేవుడు మనకిచ్చిన ధనాన్ని దేవుని రాజ్య విస్తరణ, విద్యార్థుల మధ్య బలంగా స్థాపించడానికి వాడదాం.

**స్తుతించండి**

1. మన స్టాఫ్‌కు 100% శాలరీ, అలవెన్స్‌లు ఇవ్వడానికి ప్రభువు చూపిన కృపను బట్టి

**ప్రార్థించండి**

1. యుఇయస్ఐ-ఏపి ఏసియం-2022 తర్వాత పెరిగిన 16.53% బడ్జెట్‌కు అనుగుణంగా ఇజియఫ్‌లు కాంట్రిబ్యూషన్స్ పెంచి పంపేటట్లు
2. స్టైరెట్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కోసం 8 లక్షలు, చాందపిళ్ళ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కొరకు 5 లక్షలు అవసరం
3. యుఇయస్ఐ నేషనల్ వేతన సవరణలకు అనుగుణంగా మన స్టాఫ్‌కు కూడా వేతనాలు పెంచడానికి ఏసియం 2022 నిర్ణయించారు. దీని అవసరత ప్రతి నెల రూ. 50,000/- పెరుగుతుంది.
4. స్టాఫ్‌కు ఐదు ల్యాప్‌టాప్‌లు సబ్సిడీలో ఇవ్వడానికి అవసరమైన 1,20,000/- కొరకు

ఇట్లు
క్రీస్తులో మీ సహోదరుడు

యస్.ఆర్.డి. కిషోర్ కుమార్

**AP MONTHLY REQUIREMENT – Rs. 11,41,000/- (16.53% Hike W.R.T present income)**

**MAY 2022**

| Receipts | | Payments | |
|---|---|---|---|
| Opening Balance | 342.00 | Field Staff Salaries | 4,51,416.00 |
| General Fund | 9,27,200.00 | Field Staff HRA, CA, MA & TA | 2,29,386.00 |
| Staff Support | 38,275.00 | Office Staff Salaries | 1,43,745.00 |
| Rajasthan | 10,000.00 | UESI | 80,000.00 |
| | | Rajasthan | 30,000.00 |
| | | Jammu & Kashmir | 15,000.00 |
| | | APEGF | 3,000.00 |
| | | Office Expenditure | 19,361.00 |
| | | Closing Balance | 3,909.00 |
| **Total** | **9,75,817.00** | | **9,75,817.00** |

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No. : **GTR/59/2021-2023**

**Date of Printing: 25-06-2022**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508



# ప్రార్థిస్తూనే ఉండు

నశించి పోతున్న ఆత్మల కోసం,
ప్రార్థిస్తున్నావా భారంగా నువ్వు?
వాటి పట్ల నీ కనికరం లోతెంత?
వాటి కోసం నువ్వు చెల్లించే క్రయమెంత?
ప్రార్థనా సమయం నీకు కాలక్షేప సమయమా?
విశ్రాంతినిచ్చే విరామ సమయమా అది నీకు?
ఆత్మల రక్షణ కోసం ప్రార్థించే సమయం కాదా?
ఉజ్జీవం కోసం విజ్ఞాపన చేసే సమయం కాదా?

ప్రార్థన కోసం ఆకలిగొనివుందా నీ హృదయం?
ప్రార్థన కోసం తృష్టగొంటూందా నీ ప్రాణం?
ఆలస్యం కాకుండా, పోరాటం ముగిసేదాకా!
పాతాళం ఓడే దాకా, శత్రువు పారిపోయే దాకా!
ఎన్నిసార్లు ప్రార్థించావు
ప్రార్థనలో నిన్ను నీవు మరచిపోయేంతగా,
జవాబు దొరికేంతవరకు విజయం ప్రాప్తించేదాకా,
ప్రార్థిస్తూనే ఉండేలా చేసే దాహం నీకుందా?

ఆత్మల భారంతో విలపిస్తున్నావా నీ ప్రార్థనలో?
వెచ్చటి కన్నీళ్లు కారుతున్నాయా నీ చెక్కిళ్ల పైనా?
ప్రార్థిస్తున్నావా ప్రార్థనకు జవాబులు పొందేదాకా?
ప్రార్థిస్తున్నావా వాగ్దానాల నెరవేర్పును చూసేదాకా?
అప్పుడే నీవు గెత్సేమనే వనంలోకి వెళ్ళగలవు
స్వేదం రక్తంగా మారే అనుభవం క్రీస్తుతో పంచుకోగలవు;
దేవుని హృదయాన్ని సంతోషపరచగలవు!

దేవుని బిడ్డా ప్రార్థించు, ప్రార్థనలోనే కొనసాగు!
ఏడ్వు, కన్నీరు కార్చు, ఉపవాసం ఉండు!
దేవుని శక్తి పొందే వరకు పట్టుదలను విడువకు;
దేవుడు ఆశీర్వదించే వరకు పట్టు వదలకు!
ఎప్పటినుంచో ఎదురుచూచిన దేవుని పరిపూర్ణ జవాబు వస్తుంది,
ఆత్మల రక్షణ, సాతాను ఓటమి తథ్యం,
నీ చిరకాల వాంఛ దీవెనలతో దిగివస్తుంది.
ఆయన పాదాలచెంత పడవేయుటకు బహుమానాలతో సహా.

– వెస్లీ డ్యూయల్